
RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్

ప్రజల గొంతుక - నిజం కోసం..

ఆఫ్ ప్రజలు




చర్చకు పిలిచి మొహం చాటేశారు ::: మంత్రి జూపల్లిపై హరీశ్ ఫైర్

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | శుక్రవారం, జూలై 3, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 71 | పేజీలు: 8 | వెల : రూ.1



## కాంగ్రెస్--బీఆర్ఎస్ డ్రామాలు బిగ్‌బాస్ షోను తలపిస్తున్నాయి ::: కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య కొనసాగుతున్న సవాళ్లు, ప్రతిసవాళ్ల రాజకీయాలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘాటుగా స్పందించారు. ఇరు పార్టీల నేతల తీరును "బిగ్‌బాస్ షో"తో పోలుస్తూ విమర్శలు గుప్పించారు. గురువారం హైదరాబాద్‌లో స్పందించిన బండి సంజయ్ మాట్లాడుతూ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల నటన అద్భుతంగా ఉందని, ప్రతి వారం ముందుగానే రిహార్సల్ చేసి పోటాపోటీగా రాజకీయ నాటకాలు ఆడుతున్నట్లు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. అబద్ధాలకు ఆస్కార్ అవార్డు ఇస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ అర్హులేనని వ్యాఖ్యానించిన ఆయన, తెలంగాణ ప్రజలను అమాయకులుగా భావించవద్దని హితవు పలికారు. ప్రజలు ఈ రాజకీయ నాటకాలను చూసి నవ్వుకుంటున్నారని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆధ్వర్యంలో తేదీ, సమయం, వేదిక నిర్ణయించి బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు

- మిగతా 2వ పేజీలో

# రేవంత్ హిందూ అజెండా

## టార్గెట్ కమలం...

హైదరాబాద్, జూలై 2, (వాయిస్‌టుడే) : రాజకీయాల్లో శత్రువును దెబ్బతీయాలంటే వారి బలాన్నే బలహీనతగా మార్చాలనే సూత్రాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కాగా వంటబట్టించుకున్నారు. "ముల్లును ముల్లుతోనే తీయాలి" అనే సామెతను తూచా తప్పకుండా అమలు చేస్తూ, బీజేపీ మార్కు హిందుత్వ రాజకీయాలకు అదే తరహా ఆధ్యాత్మిక బాణంతో సమాధానం ఇచ్చేందుకు రేవంత్ సిద్ధమయ్యారు. కేవలం రెండు లోక్‌సభ సీట్ల నుంచి ఢిల్లీ పీఠాన్ని కైవసం చేసుకునే స్థాయికి ఎదిగిన బీజేపీకి 'హిందుత్వ' నినాదమే కీలక భూమిక పోషించింది. ఉత్తరాదిన మెజారిటీ రాష్ట్రాల్లో ఇదే ఫార్ములాతో అధికారంలోకి వచ్చిన కమలం పార్టీ,

ఇప్పుడు దక్షిణాదిపై.. ముఖ్యంగా తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలోనే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో హిందుత్వ అంశం బీజేపీకి ప్రధాన అజెండాగా మారకుండా ఉండేలా, కాంగ్రెస్ ప్రభుత్వం సనాతన ధర్మాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయడం లేదనే బలమైన సంకేతాలను ప్రజల్లోకి పంపుతూ సీఎం రేవంత్ రెడ్డి సరికొత్త వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు.ఇందులో భాగంగానే రాష్ట్రంలో ఏకంగా రూ. 360 కోట్ల భారీ వ్యయంతో అత్యంత అధునాతన గోశాలల నిర్మాణానికి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. కేవలం గోరక్షణ ప్రకటనలకే పరిమితం కాకుండా యాదాద్రి, వేములవాడ, మొయినాబాద్‌లలో అంతర్జాతీయ ప్రమాణాలతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ గోశాలల ప్రారంభోత్సవానికి ఏకంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించాలని భావించడం రేవంత్ రెడ్డి పక్కా రాజకీయ చతురతకు నిదర్శనం. ప్రధాని మోదీ చేతుల మీదుగానే వీటిని ప్రారంభింపజేయడం ద్వారా రాష్ట్రంలో బీజేపీ చేసే రాజకీయ విమర్శల ముఖాన్ని శాశ్వతంగా మూసివేయవచ్చనేది సీఎం రేవంత్ మాస్టర్



ప్లాన్.గోసంరక్షణ అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం రాజీపడటం లేదని నిరూపించేందుకు మూడు ప్రధాన కేంద్రాల్లో విస్తృతమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొయినాబాద్‌లోని యెనికేపల్లిలో 90 ఎకరాల విస్తీర్ణంలో రూ. 160 కోట్ల భారీ వ్యయంతో అధునాతన గోశాల నిర్మాణం కాబోతోంది. ఇది రాబోయే జనవరి నాటికి పూర్తిస్థాయి నిర్వహణలోకి రానుంది. అదేవిధంగా వేములవాడలో 63 ఎకరాలు,యాదాద్రిలో 100 ఎకరాల విస్తీర్ణంలో ఒక్కొక్కటి రూ. 100 కోట్ల చొప్పున వ్యయం చేస్తూ ఆధునికంగా వీటిని నిర్మిస్తున్నారు. ఇవి వచ్చే మే, జూన్ నాటికి అందుబాటులోకి వస్తాయని అధికార వర్గాలుస్పష్టం చేస్తున్నాయి.గోసంరక్షణతో పాటు రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల పునరుద్ధరణ కార్యక్రమాలకు కూడా రేవంత్ సర్కారు సమాంతరంగా ప్రాధాన్యతనిస్తోంది. ములుగులోని సమ్మక్క-సారలమ్మ గద్దెల పునరుద్ధరణ,

- మిగతా 2వ పేజీలో




## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి త్వరలో టెండర్లు..తుది దశకు స్థలాల సేకరణ

### 19నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టు

### వెయ్యి ఇళ్ల వరకు నిర్మాణం : మంత్రి పొంగులేటి

హైదరాబాద్ : గురువారం నాడు హైదరాబాద్ లోని గోషామహల్, నాంపల్లి నియోజక వర్గాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించి డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, , మహమ్మద్ అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ , ఎమ్మెల్యేలు రాజా సింగ్, నవీన్ కుమార్ యాదవ్, శ్రీ గణేష్, , కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ధూల్పేట ప్రాంతంలో గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలిసిన 125 ఇళ్ల నిర్మాణాన్ని కూడ పూర్తి చేసి అందిస్తాం. మిగిలిన వారికి కూడా ఇళ్లు మంజూరు చేసేలా పరిసర ప్రాంతాల్లో స్థలాలను గుర్తించేందుకు కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. క్యూర్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతాల్లో1 లక్ష ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం త్వరలోనే టెండర్లు పిలవనుంది. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మూడు కార్పొరేషన్ల పరిధిలో1 లక్ష ఇండ్ల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ పూర్తి చేసుకుని మరో రెండు నుంచి మూడు రోజుల్లో నిర్మాణానికి శ్రీకారం చుడతాం. మొదటి విడత 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ క్రింద ఒక్కొక్క నియోజకవర్గంలో 500 నుంచి 1000 వరకు

- మిగతా 2వ పేజీలో

## అయోధ్యపై నబీన్ మాట్లాడరేం: పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్




హైదరాబాద్ : అయోధ్య రామ మందిరంలో హుండీ కానుకల దోపిడీ గురించి ఆయన ఎందుకు మాట్లాడలేదు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాష్ట్ర పర్యటన అట్టర్ ఫ్లాప్ అయిందని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఎద్దేవా చేశారు. అయోధ్య రామ మందిరంలో హుండీ కానుకల దోపిడీ గురించి ఆయన ఎందుకు మాట్లాడలేదు, కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలంటూ తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసినా ఎందుకు పట్టించుకోవడం లేదు, అని ప్రశ్నించారు. ప్రజలు ప్రస్తుతం బీజేపీ ముక్త్ భారత్‌ను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ. గతంలో సీఎం రేవంత్ అన్నట్లుగా రాష్ట్రంలో 2034 వరకూ కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగుతుందన్నారు. బీజేపీ ఎన్ని పార్టీలతో కలిసి వచ్చినా తెలంగాణలో కాంగ్రెస్ ను ఓడించలేదని ధీమా వ్యక్తం చేశారు. కులం, మతం పేరుతో ఎంత రెచ్చగొట్టాలనుకున్నా ఇక్కడి ప్రజలు సంయమనం పాటిస్తారని అన్నారు. కేసీఆర్ చేసిన అప్పుల్ని తీర్చడానికే

- మిగతా 2వ పేజీలో

# పంచాయితీ నేతలకు నిబిన్ సర్జరీ

హైదరాబాద్, జూలై 2, (వాయిస్‌టుడే) : తెలంగాణ బీజేపీలో అంతర్గత పరిణామాలు ఒక్కసారిగా వేడెక్కాయి. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్న అధిష్ఠానం.. తప్పులు చేస్తున్న, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నేతలపై కఠినంగా ఉండాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే తెలంగాణలో పర్యటించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పార్టీ ఆఫీస్ బేరర్ల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసినట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతాన్ని విస్మరించి, కేవలం ఆఫీసుల్లో ప్రెస్ మీట్లకే పరిమితమవుతున్న నేతల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.రాష్ట్రంలో ఎవరెవరు ఏం చేస్తున్నారు? ఎవరి వైఖరి ఎలా ఉంది? అనే విషయాలపై హైకమాండ్ వద్ద పూర్తి చిట్టా ఉందని నితిన్ నబీన్ నేరుగానే హెచ్చరించినట్లు సమాచారం. పదవులు వచ్చే వరకు ఒకలా.. వచ్చిన తర్వాత మరోలా వ్యవహరిస్తున్న కొందరు నేతల జాబితా

- మిగతా 2వ పేజీలో



# మావిగన్ అంటే ఎవరికైనా అర్థమైందా?

## జగన్‌కు చంద్రబాబు మాస్ కౌంటర్!



తిరుపతి, జూలై 2 : ఎన్నికల ముందు మూడు ముక్కలాట ఆడిన గొడ్డలి పార్టీ.. ఎన్నికలు అయిపోయాక ఇప్పుడు మావిగన్ అంటూ కొత్త పాట పాడుతోంది. అసలు ఆ మావిగన్ అంటే ఏంటో ఎవరికైనా అర్థమైందా అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలను ఉద్దేశించి ప్రశ్నించారు. తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ముక్కవారిపల్లె వేదికగా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో సరికొత్తగా రూపుదిద్దుకున్న ప్రతిష్టాత్మక గ్రామీణ ఉపాధి పథకం వీబీజీ రామ్‌జీ ను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కలిసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికలు మావిగన్ వర్సెస్ అమరావతి ఎజెండాతో జరుగుతాయన్న జగన్ వ్యాఖ్యలపై చంద్రబాబు తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు.మన రాజధాని అమరావతి దేవతల రాజధాని అని, దాన్ని ఆపడం ఎవరి తరమూ కాదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత పాలకులు రాజధానిని ధ్వంసం చేయాలని చూసినా కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, ప్రస్తుతం అమరావతిలో శరవేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. జగన్ రెడ్డి రోజుకో మాట మాట్లాడుతున్నారని, అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థలను నిర్వీర్యం చేసి, ఇప్పుడు ప్రజలను మళ్లీ భ్రమల్లో ముంచాలని చూస్తున్నారని విమర్శించారు. కూటమి నాయకత్వం నిస్వార్థంగా పనిచేస్తోందని, ఏపీని స్వర్ణాంధ్రప్రదేశ్ గా మార్చడమే తమ లక్ష్యమని, ఈ ప్రయాణం

- మిగతా 2వ పేజీలో




# 3 ఎయిర్ పోర్టులకు గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, జూలై 2, (వాయిస్‌టుడే) : తెలంగాణ ప్రజలకు గుడ్ న్యూస్. రాష్ట్రంలో ప్రస్తుతం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మాత్రమే ప్రయాణికులకు అందుబాటులో ఉంది. విమాన ప్రయాణం చేయాలంటే రాష్ట్ర నలుమూలల ప్రజలు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు రావాల్సి వస్తోంది. దీంతో ఇక్కడి వరకు రావాల్సిన అవసరం లేకుండా సమీప ప్రాంతంలోనే ప్రజలకు విమాన ప్రయాణాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కొత్త ఎయిర్‌పోర్టులపై దృష్టి పెట్టింది. మరో మూడు ఎయిర్‌పోర్టులను నిర్మించేందుకు ముందడుగు వేసింది. ఇప్పటికే వరంగల్ వద్ద మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు ఆమోదం లభించగా.. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. వచ్చే నెలలో మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఇక ఆదిలాబాద్, కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టులు నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం ఇక్కడ వాయుసేనకు సంబంధించి ఎయిర్‌స్ట్రిప్ ఉండగా.. దీని కార్యకలాపాలు నిలిచిపోయాయి. దీనిని అనుకుని ఉన్న భూమితో పాటు మరికొంత భూమిని సేకరించి ఎయిర్‌పోర్ట్ నిర్మించనున్నారు. కేంద్ర విమానయాన సంస్థ ఇప్పటికే దీని నిర్మాణానికి ఆమోదం తెలిపింది. మిలిటరీతో పాటు పౌరులకు కూడా ఉపయోగపడేలా దీని నిర్మాణం చేపట్టనున్నారు. ఇక కొత్తగూడెంలో ఎయిర్‌పోర్ట్ నిర్మించాలని ప్రభుత్వం భావిస్తుండగా.. దీనికి అనుమతి

- మిగతా 2వ పేజీలో

వాయిస్ ఆఫ్ ప్రజలు


శుక్రవారం, జూలై 3, 2026

# పంచాయితీ నేతలకు నిబిన్ సర్జరీ



ఇప్పటికే సిద్ధమైందని ఆయన సంకేతాలు ఇచ్చారు. బాధ్యతలు దక్కిన తర్వాత క్షేత్రస్థాయి పర్యటనలు చేయకుండా, ప్రజా సమస్యలను గుర్తించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తెలంగాణలో ప్రజలు బీజేపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని, అధికారంలోకి వచ్చేందుకు అనుకూల అవకాశాలు ఉన్నాయని.. అలాంటి సువర్ణావకాశాన్ని కొందరు నేతల వైఖరి వల్ల పాడుచేసుకోలేమని ఆయన గట్టిగా హెచ్చరించినట్లు తెలుస్తోంది.గడిచిన ఆరు నెలల కాలంలో ఏ నాయకుడు ఎంతవరకు ప్రజల్లో ఉన్నారు? పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను ఏ మేరకు విజయవంతం చేశారు? అనే అంశాలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు స్వయంగా ఒక ప్రత్యేక నివేదికను కోరినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ఆరు నెలల నివేదిక ఆధారంగానే భవిష్యత్తులో నేతల పదవుల కొనసాగింపుపై కీలక నిర్ణయాలు ఉంటాయని ఆయన తేల్చిచెప్పారు. ఎవరెవరు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు, ఎవరెవరు అంటీముట్టనట్లు ఉంటున్నారనే అంశంపై ఇప్పటికే అధిష్టానం ఒక స్పష్టతకు వచ్చింది. పనితీరు మార్చుకోని పక్షంలో, స్వచ్ఛందంగా పదవుల నుంచి తప్పుకోవాలని, లేదంటే అధిష్టానమే కఠిన చర్యలు తీసుకుని రాష్ట్ర కమిటీలో భారీ మార్పులు చేర్పులు చేస్తుందని హెచ్చరించారు.పార్టీలో సొంత అజెండాలు నడుపుతూ, గ్రూపు రాజకీయాలకు తెరలేపుతున్న నేతలపై నితిన్ నబీన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడినట్లు సమాచారం. గ్రూపు రాజకీయాలను ఏమాత్రం సహించే ప్రసక్తే లేదని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత విభేదాలు పక్కనబెట్టి ఉమ్మడిగా పనిచేయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని గట్టి సంకేతాలు పంపారు. నియోజకవర్గాల్లో పట్టు పెంచుకోకుంటే కఠిన చర్యలు తప్పవని, బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తే పదవులను వదులుకోవడానికి సిద్ధంగా ఉండాలని ఆయన హెచ్చరించడం ఇప్పుడు టీబీజేపీలో తీవ్ర కలకలం రేపుతోంది.ఒకవైపు తెలంగాణలో నితిన్ నబీన్ పర్యటన సాధారణ శ్రేణుల్లో తీవ్ర జోష్ నింపినప్పటికీ, మరోవైపు ఆయన చేసిన హెచ్చరికలు పార్టీలోని కొందరు ముఖ్య నేతలకు, ఆఫీస్ బేరర్లకు ఇబ్బందికరంగా మారాయి. అధికారం చేజిక్కించుకునేందుకు అన్ని అవకాశాలు ఉన్నా, కొందరి తీరువల్ల పార్టీకి నష్టం జరుగుతోందని, అలాంటివాళ్లను దూరం పెట్టక తప్పదని హైకమాండ్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు స్పష్టమవుతోంది. మరి ఇప్పటికైనా ఈ హెచ్చరికలను గుణపాఠంగా తీసుకుని, నితిన్ నబీన్ దిశానిర్దేశాన్ని టీబీజేపీ నేతలు తూచ తప్పకుండా పాటిస్తారా? అంతర్గత విభేదాలను పక్కనబెట్టి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కలిసికట్టుగా కృషిచేస్తారా? లేదా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# మావిగన్ అంటే ఎవరికైనా అర్థమైందా?



ఇక అన్‌స్టాపబుల్ అని చంద్రబాబు ప్రకటించారు.గతంలో ఉపాధి హామీ పథకం రాయలసీమ నుంచే ప్రారంభమైన విషయాన్ని గుర్తుచేస్తూ.. మెరుగైన సవరణలతో దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన వీబీజీ రామ్‌జీ పథకం కూడా ఇక్కడి నుంచే ఆవిష్కృతం కావడం చారిత్రాత్మకమని సీఎం అన్నారు. కేంద్రం రూ. 7,700 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 4,000 కోట్ల వాటాతో మొత్తం రూ. 11,000 కోట్లకు పైగా వ్యయంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. గతంలో 100 రోజులుగా ఉన్న పనిదినాలను ఈ పథకం ద్వారా 125 రోజులకు పెంచామని, జీయో ట్యాగింగ్, బయోమెట్రిక్ వంటి సాంకేతికతతో దొంగ లెక్కలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.ఈ పథకం ద్వారా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన జరిగి, రూపురేఖలు మారిపోతాయని చంద్రబాబు కొనియాడారు. గతంలో ఒకే రోజు 13,226 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి గిన్నిస్ రికార్డు సృష్టించిన ఘనత పవన్ కల్యాణ్‌కే దక్కిందన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో వేల కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు, గోకులాలు, ఫార్మ్ పాండ్లు నిర్మించామని, ఈ ఏడాది మరో 10 వేల కి.మీ గ్రావెల్ రోడ్లు, 1,500 కి.మీ సిమెంట్ రోడ్లను నిర్మించడమే కాకుండా.. పొలాలకు వెళ్లే డొంక రోడ్లను కూడా ఈ రామ్‌జీ పథకం కింద నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, గాలేరు-నగరి ద్వారా కోడూరుకు నీళ్లు తెస్తామని, జలధార ద్వారా భూగర్భ జలాలను పెంచుతామని భరోసా ఇచ్చారు. రాయలసీమతో పాటు ఏపీని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోందని చంద్రబాబు వివరించారు. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టడంతో పాటు రైల్వే జోన్ సాధించామని చెప్పారు. రాయలసీమను ఉద్యాన పంటల కేంద్రంగా మారుస్తూ.. త్వరలోనే మదనపల్లిలో హార్టికల్చర్ హబ్ కు శంకుస్థాపన చేయబోతున్నట్లు ప్రకటించారు. తిరుపతిలో బుల్లెట్ మోటార్ సైకిల్ ప్లాంట్, పుట్టపర్తిలో ఆమ్కా ఫైటర్ జెట్ తయారీ యూనిట్, ఉత్తరాంధ్రకు గూగుల్ డేటా సెంటర్ రాబోతున్నాయన్నారు. బంగారం గనులు దొరికిన జొన్నగిరి పేరును 'స్వర్ణగిరి'గా మార్చామని, ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ స్వర్ణాంధ్ర సంకల్పాన్ని నిజం చేస్తామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

**ఆంధ్రప్రదేశ్‌లో వీబీ గ్రామ్‌జీ పథకం ప్రారంభం!**

గ్రామాల్లో విప్లవం మొదలైందన్న సీఎం, డిప్యూటీ సీఎం!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చే దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. తిరుపతి జిల్లాలోని ముక్కాల వారి పల్లె వేదికగా వికసిత భారత్ జి రామ్ జి పథకాని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా, పారదర్శకమైన పాలనతో పేదరిక నిర్మూలన దిశగా ఈ పథకాన్ని రూపొందించినట్టు ప్రభుత్వం ప్రకటించింది.

**ఏంటీ ఈ వీబీ గ్రామ్‌జీ ?**

వీబీ గ్రామ్‌జీ అనేది గతంలో ఉన్న ఉపాధి హామీ పథకానికి మెరుగై సవరణలు చేస్తూ, గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిచ్చేలా రూపొందించిన కొత్త విధానం. ఈ పథకం కింద కేవలం శ్రమ శక్తిని వినియోగించడమే కాకుండా, శాశ్వత గ్రామీణ ఆస్తుల నిర్మాణానికి పెద్ద పీట వేస్తారు. దీని ద్వారా గ్రామాల్లో సిమెంట్ రహదారులు, మురుగు నీటి కాలువలు, భూసార పరిరక్షణ పనులు, పశువుల కోసం నీటి తొట్టెలు వంటి మౌలిక సదుపాయాలను నిర్మిస్తారు. ఈ పథకం ప్రధాన ఉద్దేశం గ్రామాలకు ఆర్థికంగా సామాజికంగా బలాన్ని ఇవ్వడం. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కోసం దేశవ్యాప్తంగా రూ. 7.5 లక్షల కోట్లు కేటాయించగా, ప్రతి గ్రామానికి ఉపాధి కార్యక్రమాల నిమిత్తం సుమారు రెండు కోట్లు అందజేయాలని నిర్ణయించింది. దేశవ్యాప్తంగా జులై 1 నుంచే పథకం ప్రారంభమైంది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం రెండో తేదిన స్టార్ట్ చేశారు. తిరుపతి జిల్లా ముక్కాలవారి పల్లెలో గురువారం నాడు ప్రారంభమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు తన పర్యటనలో ఈ పథకాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ , కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ప్రసంగించారు. పథకం అమలులో గతంలో అమలులో ఉన్న లోపాలను సరిదిద్దుతూ అనేక సంస్కరణలు ప్రవేశపెట్టారని చంద్రబాబు తెలిపారు. గతంలో ఉన్నవ వంద రోజుల పని కాలన్ని 125రోజులకు పెంచారని వివరించారు. మరికొన్ని సందర్భాల్లో ఏడాదికి 185 రోజుల వరకు పని కల్పించే అవకాశం ఉందని సీఎం తెలిపారు. గతంలో ఎంజీనరేగాలో కేంద్ర, రాష్ట్రాల వాటా 90:10గా ఉండేదని, ఇప్పుడు రాష్ట్రాల వాటాను 40 శాతానికి పెంచడం ద్వారా అభివృద్ధి పనుల్లో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యాన్ని మరింత పెంచారని అభిప్రాయపడ్డారు. నిధుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు రియల్ టైమ్ మానిటరింగ్, డిజిటల్ విధానాన్ని తీసుకుచ్చారని వివరించారు. దీని వల్ల దొంగ లెక్కలు రాసే అవకాశం ఉండదని తెలిపారు. కార్మికులు చేసిన పనికి వేతనం ఆలస్యం కాకుండా, నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే డబ్బులు జమ అవుతాయన్నారు. ఏ గ్రామంలో ఏ పని చేపట్టాలనేది స్థానికంగా గ్రామ సభలే నిర్ణయించుకుంటాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ పథకం అమలు కోసం మొత్తం రూ. 12, 845 కోట్లు ఖర్చు చేయనున్నట్టు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఇందులో కేంద్రం నుంచి 7700 కోట్లు, రాష్ట్ర వాటాగా 4000 కోట్లు కలిపి ప్రారంభంలో 11000 కోట్లుపైనే నిధులు సిద్ధం చేసినట్టు తెలిపారు. గత రెండేళ్లలో పల్లె పండుగ వంటి కార్యక్రమాల ద్వారా 16, 695 కోట్ల ఉపాధి నిధులను ప్రభుత్వం సమర్థవంతంగా వినియోగించిందని పవన్ గుర్తు చేశారు.

## రెండు, మూడు నెలల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం: కేంద్రమంత్రి

**అంతర్జాతీయంగా ముడిచమురు**

**ధరలు స్థిరంగా కొనసాగడమే ఇందుకు కీలకం**

**పాత నిల్వలు అధిక ధరకు కొన్నందున కంపెనీలకు భారీ నష్టాలు**

**ఇప్పటికే పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 తగ్గించిన నయారా ఎనర్జీ**

**ఇప్పటికే తగ్గిన కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరలు**



వాహనదారులకు ఊరటనిచ్చేలా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి కీలక సంకేతాలిచ్చారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ప్రస్తుత స్థాయిలోనే స్థిరంగా కొనసాగితే, రాబోయే రెండు, మూడు నెలల్లో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం ఉందని ఆయన గురువారం వెల్లడించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ముడిచమురు ధరలు గరిష్ఠంగా ఉన్న సమయంలో కొనుగోలు చేసిన నిల్వలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రస్తుతం వినియోగిస్తున్నాయని మంత్రి వివరించారు. దీనివల్ల జూన్ 30 నాటికి ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ విక్రయాలపై సుమారు రూ. 74,781 కోట్ల మేర నష్టాలను చవిచూశాయని పేర్కొన్నారు. ధరల తగ్గింపుపై ఇప్పుడే వ్యాఖ్యానించడం తొందరపాటే అవుతుందని, అదంతా ముడిచమురు ధరల స్థిరత్వంపైనే ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇదిలావుండగా, ప్రైవేట్ రంగ ఇంధన రిటైలర్ 'నయారా ఎనర్జీ' జూలై 1 నుంచి తన అవుట్‌లెట్లలో లీటరు పెట్రోల్‌పై రూ. 5, డీజిల్‌పై రూ. 3 చొప్పున తగ్గించింది. గత రెండేళ్ల కాలంలో చమురు ధరలు తగ్గడం ఇదే తొలిసారి. అలాగే, వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల ధరలను సైతం రూ. 183.50 మేర తగ్గించగా, గృహ వినియోగ సిలిండర్ల ధరల్లో మాత్రం ఎటువంటి మార్పు లేదు. గత నాలుగేళ్లలో భారత్‌లో పెట్రోల్ ధరలు కేవలం 5.58 శాతం, డీజిల్ ధరలు 6.23 శాతం మేర మాత్రమే పెరిగాయని, అదే సమయంలో అభివృద్ధి చెందిన దేశాల్లో 20 శాతం, పొరుగు దేశాల్లో 35 శాతం వరకు పెరిగాయని మంత్రి గుర్తు చేశారు.

## చర్చకు పిలిచి మొహం చాటేశారు: మంత్రి జూపల్లిపై హరీశ్ ఫైర్

**చర్చకు పిలిచి మంత్రి జూపల్లి రాలేదని హరీశ్ రావు విమర్శలు**

**తెలంగాణ భవన్‌కు వచ్చిన బీఆర్ఎస్ నేతలు, గైర్హాజరైన మంత్రులు**

**గన్ పార్క్ వద్దకు వెళ్తుండగా హరీశ్ రావు, ఇతర నేతల అరెస్ట్**

**ఖాళీ కుర్చీతో జూపల్లి కోసం కేటీఆర్ ఎదురుచూపులు**

**టెండర్లు, అప్పులపై చర్చకు కాంగ్రెస్ భయపడుతోందన్న బీఆర్ఎస్**



తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య రాజకీయ పోరు తీవ్రరూపం దాల్చింది. గురుకుల పాఠశాలల టెండర్లు, రాష్ట్ర అప్పులపై బహిరంగ చర్చకు రావాలంటూ సవాల్ విసిరిన మంత్రి జూపల్లి కృష్ణారావు, తీరా సమయం వచ్చేసరికి వెనకడుగు వేశారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం చర్చ కోసం తాము తెలంగాణ భవన్‌కు చేరుకున్నా, మంత్రి రాకపోవడంపై ఆయన మండిపడ్డారు. గురువారం హరీశ్ రావు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అదే సమయంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ గన్ పార్క్ వద్ద ఉన్నారన్న సమాచారంతో వారు అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య స్వల్ప తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. "చర్చకు రమ్మని సవాల్ విసిరింది వాళ్లే, తీరా మేము వస్తే పోలీసులను ప్రయోగించి అడ్డుకోవడం చూస్తుంటే, టెండర్లలో జరిగిన అవినీతి బయటపడుతుందనే భయంతోనే వారు పారిపోయారని స్పష్టమవుతోంది" అని హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్ర అప్పు రూ. 8 లక్షల కోట్ల నుంచి రూ. 7 లక్షల కోట్లకు ఎలా తగ్గిందో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు కోసం ఖాళీ కుర్చీ వేసి వేచి చూశారు. పోలీసుల చర్యను ఆయన తీవ్రంగా ఖండించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పులపాలైందని, భారీ స్థాయిలో అవినీతి జరిగిందని కాంగ్రెస్ మంత్రులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఇరు పార్టీల నేతలు బహిరంగ చర్చకు సవాళ్లు విసురుకున్నారు.

## కాంగ్రెస్--బీఆర్ఎస్ డ్రామాలు బిగ్‌బాస్ షోను తలపిస్తున్నాయి

సవాల్ విసిరారు. గురుకులాల టెండర్లు, తెలంగాణ అప్పులు, అవినీతి, అక్రమాలు, పాలనా వైఫల్యాలపై ప్రజల ముందే చర్చిద్దామని పిలుపునిచ్చారు. అలాగే, కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి అందించిన నిధులు, అమలు చేసిన సంక్షేమ పథకాలపై కూడా చర్చించేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని తెలిపారు. ఇరు పార్టీలు ఇలాగే రాజకీయ డ్రామాలు కొనసాగిస్తే ప్రజలు తిరస్కరించడం ఖాయమని పేర్కొన్న బండి సంజయ్, లి"ఈ రాజకీయ బిగ్‌బాస్ షోలో ప్రజలు డబుల్ ఎలిమినేషన్ కోరుకుంటున్నారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు"లి అంటూ ఎక్స్ వేదికగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై విమర్శలు గుప్పించారు.

# రేవంత్ హిందూ అజెండా

బాసర, వేములవాడ సహా దాదాపు 20 ప్రధాన దేవాలయాల అభివృద్ధి పనులను ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. యాదాద్రిలో వేద పాఠశాల ఏర్పాటుతో పాటు, రాబోయే గోదావరి పుష్కరాలనుఅత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ చర్యల ద్వారా సనాతన ధర్మ పరిరక్షణలో తాము ఎవరికీ తీసిపోమని కాంగ్రెస్ ఆచరణలో నిరూపిస్తోంది.ఇటీవల బక్రీద్‌పండుగ సందర్భంగా రాష్ట్రంలో ఎక్కడా గోవధ జరగకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం, హైదరాబాద్‌కు గోవులు తరలకుండా అడ్డుకోగలగడం ఈ వ్యూహంలో భాగమేనని అధికారులు చెప్తున్నారు. దేశవ్యాప్తంగా ముస్లిం వర్గాల నుంచి కూడా గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలనే డిమాండ్లు వస్తున్న తరుణంలో, రేవంత్ రెడ్డి తీసుకుంటున్న ఈ నిర్ణయాలు సర్వత్రా సానుకూలతనుసంపాదిస్తున్నాయి. మొత్తానికి 'గోమాతాస్త్రం' ద్వారా బీజేపీ హిందుత్వ రాజకీయాలకు రేవంత్ రెడ్డి వేసిన పక్కా వ్యూహాత్మక ఎత్తుగడ తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీసింది.

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి త్వరలో టెండర్లు..తుది దశకు స్థలాల సేకరణ

యుద్ధ పతిపదిక పూర్తి చేస్తాం. పట్టణ ప్రాంతాల్లో భూమి విలువ ఎకరాకు రూ.100 నుంచి రూ.200 కోట్ల వరకు ఉన్నా కూడా ఆ భూముల విలువను పక్కనబెట్టి పేదలకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి వారి పేరిట పట్టాలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ నిర్మించిన ఇళ్ల కంటే కేవలం రెండున్నరేళ్లలోనే ఎక్కువ ఇండ్లు నిర్మించాము. భవిష్యత్ లో కూడా ఇంకా ఇళ్లు నిర్మిస్తాం. బీఆర్ఎస్ కట్టిన ఇండ్లకంటే ఎక్కువ నిర్మించకపోతే రానున్న ఎన్నికల్లో పోటీ చేయనని విసిరిన సవాల్కు ఇప్పటివరకు బీఆర్ఎస్ నేతల నుంచి స్పష్టమైన స్పందన రాలేదు. పేదల ఇళ్ల నిర్మాణంలో స్వప్రయోజనం ఉండదనే ఆలోచనతో గత పాలకులు భారీ ప్రాజెక్టుల పేరుతో అవినీతికి పాల్పడ్డారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా గుడిసెల్లేని తెలంగాణ లక్ష్యాన్ని సాధిస్తామని అన్నారు.

## అయోధ్యపై నబీన్ మాట్లాడరేం: పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్

ప్రభుత్వం నానా తంటాలు పడుతుంటే, కొత్తగా వీబీ జీరామ్‌జీ పేరిట కేంద్రం కొత్తగా భారం మోపడం సరికాదన్నారు. మూసీ ఆధునికీకరణ తొలి దశ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.7వేల కోట్లని, అందులో లక్షల కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. కాగా,యాదగిరిగుట్టను గొప్పగా తీర్చిదిద్దాలన్నది సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన అని, ఆ నేపథ్యంలోనే పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా కొందరు వ్యక్తులు, నిష్ణాతులతో ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేశారని తెలిపారు. దాన్ని రాజకీయ కోణంలో చూడాల్సిన అవసరం లేదన్నారు. భగవంతుడి దగ్గర ప్రాంతాలు ఉండవని, టీడీటీ పాలకమండలిలో తెలంగాణ వ్యక్తులు లేరా అని ప్రశ్నించారు. మండలి నియామకంలో తనను సంప్రదించలేదంటూ రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తానని, ఈ అంశంపై తాను రాజగోపాల్‌రెడ్డితో మాట్లాడానని, సీఎంతోనూ మాట్లాడతానన్నారు. అక్కడి అవసరాల దృష్ట్యా కొన్ని నిర్ణయాలు తీసుకుంటామని, అన్నింట్లో అందర్నీ భాగస్వాములను చేయలేమని చెప్పారు.

## 3 ఎయిర్ పోర్టులకు గ్రీన్‌సిగ్నల్

రావాల్సి ఉంది. కొత్తగూడెం ఎయిర్‌పోర్టుపై కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. త్వరలోనే కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు లభిస్తాయని రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తోంది. త్వరలోనే తుది అనుమతులు లభించనున్నాయని సమాచారం.తాజాగా హైదరాబాద్‌లో ఏరోమార్ట్ 2026 సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సుకు ముఖ్యఅతిధిగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్త ఎయిర్‌పోర్టులపై కీలక ప్రకటన చేశారు. వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టుకు వచ్చే నెలలోనే శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు. అలాగే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు కేంద్రం నుంచి అనుమతి వచ్చిందని, డీపీఆర్ కూడా రెడీ అయిందన్నారు. మిలిటరీ, పౌర అవసరాలకు ఉపయోగపడేలా ఆదిలాబాద్ ఎయిర్ పోర్టు నిర్మించనున్నట్లు స్పష్టం చేశారు. కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు కేంద్రం నుంచి అనుమతి రావాల్సి ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏరోస్పేస్ రంగానికి అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. స్పేస్, డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాలకు అవసరమైన విడిభాగాలు తయారుచేసే 1500కిపైగా ఎంఎస్ఎంఈలు ప్రస్తుతం రాష్ట్రంలో పనిచేస్తున్నాయన్నారు. ప్రపంచంలో యుద్ధ విమానాలు, హెలికాప్టర్లకు మేడ్ ఇన్ తెలంగాణకు లేబుల్‌తో కూడిన విడిభాగాలు అమర్చబడుతున్నాయని తెలిపారు. తెలంగాణలో పారిశ్రామిక ప్రగతికి ఇదే ఒక నిదర్శనమని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

### తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గురువారం సాయంత్రం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. తిరుపతి జిల్లాలో జరిగిన అధికారిక పర్యటనను ముగించుకున్న అనంతరం ఆయన తిరుమలకు చేరుకుని మొక్కులు చెల్లించుకుని, శ్రీవారి సేవలో పాల్గొన్నారు. అంతకుముందు, తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ముక్కవారిపల్లెలో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ గ్రామీణ్' (వీబీ-జీ-రామ్-జీ) పథకం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు హాజరైన ఈ కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రారంభమైంది. ప్రభుత్వ కార్యక్రమం ముగిసిన తర్వాత తిరుమలకు చేరుకున్న పవన్ కల్యాణ్‌కు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను, చిత్రపటాన్ని ఆయనకు బహూకరించారు. తిరుమల పర్యటనలో పవన్ వెంట తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కల్యాణం శివ శ్రీనివాస, హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కమిషనర్ కృష్ణ తేజ తదితరులు ఉన్నారు.

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం.. తెలుగు దినపత్రిక



# ప్రయాణీకుల భద్రతే ధ్యేయం...

**జె.బి.ఎమ్ (జీదీవీ) ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులు తాత్కాలిక నిలిపివేత...**

**హైదరాబాద్ బస్ భవన్‌లో కమాండ్ కంట్రోల్ ఏర్పాటు...**

**100% సేఫ్టీ సర్టిఫికేట్ వస్తేనే సర్వేసుల పునరుద్ధరణ...**




సికింద్రాబాద్, జూలై 02 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో నేషనల్ ఎలక్ట్రిక్ బస్ ప్రోగ్రామ్ కింద నడుస్తున్న జె.బి.ఎమ్ ఎలక్ట్రిక్ బస్సులలో (జీదీవీ వ-దీబంవం) వరుసగా హై వోల్టేజ్ బ్యాటరీ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, ప్రయాణీకుల భద్రతను దృష్ట్యా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డిపోల పరిధిలో తిరిగే జె.బి.ఎమ్ సంస్థకు చెందిన ఎలక్ట్రిక్ బస్సుల కార్యకలాపాలను తాత్కాలిక నిలిపివేతకు యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. గత నెల జూన్ 21వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు కరీంనగర్ సమీపంలో అలుగునూర్ వద్ద జరిగిన బస్సు అగ్ని ప్రమాదము పై పూర్తి నివేదిక రాకమునుపే మరొక సంఘటన జరగడం వలన ప్రయాణీకులు, సిబ్బంది ఊ ప్రజల ప్రాణాల రక్షణే అత్యంత ప్రాధాన్యతగా భావించి, తెలంగాణ ఆర్టీసీ యాజమాన్యం ఈ నిర్ణయాన్ని తీసుకుంది.

తదుపరి చర్యలు, షరతులు

తెలంగాణ ఆర్టీసీ జేబీఎం సంస్థను ప్రమాదాల విశ్లేషణ నివేదిక, శాశ్వత నివారణ చర్యలు, బ్యాటరీ ఫిట్నెస్ సర్టిఫికేషన్, హైదరాబాద్ బస్సు భవన్లో కమాండ్ కంట్రోల్ ఏర్పాటు, భద్రతకు సంబంధించిన పలు అంశాలపై స్పందించి తగు నివేదిక సమర్పించవలసిందిగా కోరడం జరిగింది.

పునరుద్ధరణపై నిర్ణయం

ఆర్టీసీ విజ్ఞాపన పై స్పందించిన జె.బి.ఎమ్ సంస్థ పైన పేర్కొన్న పలు అంశాల పైన తక్షణమే నివేదికలు, సిద్ధం చేసేందుకై వారి టెక్నికల్ టీం, చైనా నుంచి బ్యాటరీ నిపుణుల బృందం కూడా ప్రమాద పరిస్థితులు వాటికి దారి తీసిన సందర్భాలను పరిశీలించి పలు నివారణ చర్యలపై నివేదిక తయారు చేసే పనిలో నిమగ్నమై ఉన్నాయి. భద్రతా ప్రమాణాలు, సంబంధిత నివేదికలను ఆర్టీసీ ఉన్నతాధికారుల బృందం క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, సంస్థ నిర్దేశించిన అన్ని షరతులను జె.బి.ఎమ్. యాజమాన్యం పూర్తిగా పాటించినట్లు సంతృప్తి చెందిన పిదప, వారి టెక్నికల్ బృందం "ఎవష్త్రఅఎశ్రీవ ఖీఔ టశీతీ రాజూవతీఘ్అశీఅ" అని ధృవీకరించిన వాహనాల పునరుద్ధరణ పై తుది నిర్ణయం తీసుకోబడుతుంది. ప్రజారవాణాలో భద్రత విషయంలో టీజీఎస్ ఆర్టీసీ ఎటువంటి రాజీ పడదని, ప్రయాణీకులు సురక్షితంగా ప్రయాణించేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని యాజమాన్యం స్పష్టం చేసింది.



## ప్రభుత్వ పాఠశాలలను మూసివేయొద్దు..

**ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలి: ఎస్ఎఫ్ఐ**

**డైరెక్టరేట్ ముట్టడిలో ఉద్రిక్తత, విద్యార్థి నాయకుల అరెస్టు**

సికింద్రాబాద్, జూలై 02 (వాయిస్ టుడే ప్రతినిధి): రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ప్రత్యేక ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని, ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలన్న ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌ను ముట్టడించింది. ఈ సందర్భంగా పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య ఉద్రిక్తత నెలకొంది. ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులు చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులను అదుపులోకి తీసుకుని నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులపై లాఠీచార్జీ జరిగిందని ఎస్ఎఫ్ఐ ఆరోపించింది. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాల్సిన సమయంలో వాటిని మూసివేస్తామని ప్రకటించడం బాధ్యతారాహిత్యమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాంలు, బ్రేక్‌ఫాస్ట్ పథకం, మధ్యాహ్న భోజన పథకం వంటి హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని వారు పేర్కొన్నారు. మరోవైపు ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించడంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీరు, రన్నింగ్ వాటర్, కంప్యూటర్ ల్యాబ్‌లు వంటి కనీస మౌలిక వసతులు కూడా లేవని, వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపైనా వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యా సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఎస్ఎఫ్ఐ హెచ్చరించింది. ఈ ఆందోళన లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కిరణ్, కె. అశోక్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.వై. ప్రణయ్, కార్తీక్, లెనిన్ గువేరా, రమేష్, వెన్నెలతో పాటు పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సంఘం తెలిపింది.

## నాగారం కాంగ్రెస్ అధ్యక్ష నియామకాన్ని వ్యతిరేకించిన సీనియర్ నాయకులు



నాగారం, జూలై 2:-(వాయిస్ టుడే): మేడ్చల్ జిల్లాలోని పలు డివిజన్లకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను పీసీసీ నియమించిన నేపథ్యంలో నాగారం డివిజన్ అధ్యక్షుడిగా ఎలసాని భూమయ్య యాదవ్ నియామకాన్ని స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు వ్యతిరేకించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడి పనిచేసిన కార్యకర్తలను పక్కనపెట్టి, తోటకూర వజ్రేష్ యాదవ్‌కు బంధుత్వం ఉన్న కారణంగానే ఎలసాని భూమయ్యకు పదవి కట్టబెట్టారని ఆరోపించారు. దీంతో నిజాయితీగా పనిచేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నంరాజు సతీష్ గౌడ్ మాట్లాడుతూ "20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నాను. గతంలో మూడు సార్లు పార్టీ పదవి కోసం దరఖాస్తు చేసుకున్నా అవకాశం రాలేదు. కానీ కేవలం బంధుత్వం కారణంగా ఎలసాని భూమయ్య యాదవ్‌కు డివిజన్ అధ్యక్ష పదవి ఇవ్వడం సామాన్య కార్యకర్తలకు తీవ్ర అన్యాయం" అని విమర్శించారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ గూడూరు అశోక్ గౌడ్ మాట్లాడుతూ 1978 చెన్నారెడ్డి ముఖ్యమంత్రి గా వున్నపటి నుండి పార్టీకి పనిచేతున్నాము కనీసం సీనియర్ అని గౌరవం లేకుండా ఇష్టనుసారంగా వజ్రష్ యాదవ్ వ్యవహారిస్తున్నాడని, వజ్రష్ యాదవ్ ను నాగారం మున్సిపల్ కార్యకర్తలు అందరు వ్యతిరేకిస్తున్నారు. రాబోయే రోజులో నాగారం లో వజ్రష్ ని తిరగనీయం అనీ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాసరెడ్డి, మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దాసోహం నర్సింగ్ రావు (చిన్న ), బాలు యాదవ్, దాసరి రాంరెడ్డి, కిట్టు యాదవ్, సత్యనారాయణ యాదవ్, రవి, పంగ శ్రీహరి, గౌస్, ప్రవీణ్ యాదవ్, రామాగోని శ్రీనివాస్ గౌడ్, మనోహర్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి ( సీఎంర్ఫ్ ) చెక్కులను పంపిణీ చేసిన డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్



కుత్బుల్లాపూర్ జులై 02(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు అనారోగ్యం రీత్యా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వెంకట్రావు, లావణ్య, మోహన్, శంకర్ నాయుడు, స్వరూప తదితరులు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. వారి దరఖాస్తులను పరిశీలించిన అనంతరం మొత్తం రూ.3.50 లక్షల విలువైన సహాయ నిధి చెక్కులు మంజూరయ్యాయి, ఈ చెక్కులను కూన శ్రీనివాస్ గౌడ్ షాపూర్ నగర్ లోని నివాసంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా ఇన్చార్జ్ మంత్రి శ్రీధర్ బాబు సారాధ్యంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు,బాధితులు తమకు ఆర్థిక చేయూత అందించిన ప్రభుత్వానికి మరియు డీసీసీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాసరెడ్డి, సిహెచ్ బుచ్చిరెడ్డి, మోతే శ్రీనివాస్ యాదవ్, షాకీర్, రఘు గౌడ్, వెంకట్ రెడ్డి, శంకర్ గౌడ్, చోటు బాయ్, లక్ష్మణ్, కనకరాజు, రాకేష్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## మేడిపల్లి డివిజన్‌లో ఓటర్ లిస్టు సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్

నాగారం, జూలై 2:-(వాయిస్ టుడే): మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ మేడిపల్లి డివిజన్‌లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ లిస్టు సవరణ (సర్) కార్యక్రమాన్ని మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను బీఎల్ఓలు, బీఎల్ఏలు ఎలా నిర్వహిస్తున్నారో పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా అధికారులు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా సవరణ ప్రక్రియను నిర్వహించాలని కోరారు. అలాగే బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏలు) ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని, ఓటరు జాబితాలో ఏవైనా పొరపాట్లు ఉంటే వెంటనే గుర్తించి సరిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ శివ కుమార్ గౌడ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి , మాజీ జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షులు వంగేటి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కాల్ సెక్రెటరీ ఏనుగు జలంధర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలలో 2రోజుల 'ఓజస్-2కె26' ఫెస్ట్

సికింద్రాబాద్, జూలై 02 (వాయిస్ టుడే ప్రతినిధి): విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, కళా ప్రతిభను ప్రోత్సహించేందుకు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో జూలై 7, 8 తేదీల్లో 'ఓజస్-2కె26' పేరుతో రెండు రోజుల కల్చరల్-అకాడమిక్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాశీం తెలిపారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని సుమారు 30 యూజీ, పీజీ కళాశాలల విద్యార్థులను ఈ ఫెస్ట్‌లో పాల్గొనాలని ఆహ్వానించామన్నారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జరిగే ఈ వేడుకల్లో సృజనాత్మక కథల రచన, ఫోటోగ్రఫీ, డ్రాయింగ్-పెయింటింగ్, షార్ట్ ఫిల్మ్, జామ్ సెషన్, క్విజ్, సోలో డాన్స్, గ్రూప్ సింగింగ్, బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్, ట్రెజర్ హంట్, ఫ్యాషన్ షో, పాలసీ ఇన్నోవేషన్, ప్రజెంటేషన్ తదితర సాహిత్య, సాంస్కృతిక, అకాడమిక్ పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో విజేతలకు నగదు బహుమతులతో పాటు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆర్ట్స్ కళాశాల చరిత్రలోనే తొలిసారిగా ఈ స్థాయిలో కల్చరల్-అకాడమిక్ ఫెస్ట్ నిర్వహించడం విశేషమని ప్రొఫెసర్ కాశీం పేర్కొన్నారు. అలాగే జూలై 9న సాయంత్రం 5 గంటలకు ఆర్ట్స్ కాలేజీ డే వేడుకలను అదే ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ముఖ్య అతిథిగా, కళాశాల విద్య కమిషనర్ దేవసేన, ప్రముఖ సినీ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.




## ఓయూ అభివృద్ధికి రూ.1,000 కోట్లు వెంటనే విడుదల చేయాలి: ఏబీవీపీ

**రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన**

**ఖాళీ పోస్టుల భర్తీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు డిమాండ్**

సికింద్రాబాద్, జూలై 02 ( వాయిస్ టుడే ప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి కోసం ప్రకటించిన రూ.1,000 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రిని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఉస్మానియా యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏబీవీపీ ఓయూ అధ్యక్షుడు గెల్లు శేఖర్, కార్యదర్శి గుడూర్ మోక్షిత్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్ట్స్ కళాశాల వేదికగా ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న 941 టీచింగ్ పోస్టులతో పాటు నాన్-టీచింగ్ పోస్టులను కూడా తక్షణమే భర్తీ చేయాలన్నారు. విద్యార్థులకు రావాల్సిన రూ.103 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. చాలా కాలంగా వెనుకబడిన అకాడమిక్ క్యాలెండర్‌ను వెంటనే గాడిలో పెట్టి, విద్యా కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించేలా విశ్వవిద్యాలయ అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ సిటీ సెక్రటరీ పృథ్వితేజ, స్టేట్ జాయింట్ సెక్రటరీ అలివేలు రాజు, విద్యానగర్ విభాగ కన్వీనర్ హరిప్రసాద్, స్టేట్ యూనివర్సిటీ కో-కన్వీనర్ గంధం నరేందర్, హరిచంద్ర, వీరబాబు, తన్మై, హరీష్, వివేక్, ధన్‌రాజ్, మోహన్‌బాబు తదితర నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## హరీష్ రావు వ్యాఖ్యలపై ఓయూ జేఏసీ నిరసన

**ఆరోపణలు ఉపసంహరించుకోవాలని డిమాండ్**

సికింద్రాబాద్, జూలై 2 (వాయిస్ టుడే ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం, గురుకుల శాఖ మంత్రులపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని, హరీష్ రావు తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఎదుట ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావు గురుకులాల్లో రూ.2,000 కోట్ల అవినీతి జరిగిందంటూ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కొత్తపల్లి తిరుపతి మాట్లాడుతూ గురుకులాల్లో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న హరీష్ రావు గన్‌పార్క్ వద్ద బహిరంగ చర్చకు రావాలని గతంలో సవాల్ విసిరామని, నిర్ణయించిన సమయంలో ఆయనతో పాటు కేటీఆర్ కూడా హాజరు కాలేదని అన్నారు. దమ్ముంటే ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలకు వచ్చి విద్యార్థుల సమక్షంలో బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉస్మానియా విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్న ఆయన, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి, మంత్రులు ఒక్కసారి కూడా ఓయూకు రాలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండుసార్లు ఓయూను సందర్శించి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, ఎస్టీ సెల్ వైస్ చైర్మన్ భీమ్రావు మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో భారీ అవినీతి, కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. ప్రజా ప్రయోజనాల కంటే సొంత పార్టీ నాయకులకే ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ నాయకులు దరువు రమేష్, యుగేందర్, రాజేందర్, కొమ్ము స్వామి, కొమ్ము సురేష్, బాబు, అరుణ్, రాజు, శ్రీనివాస్, రవి, చరణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాయిస్

హైదరాబాద్
శుక్రవారం 3 జూలై 2026

## అనుమతి లేని అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన మున్సిపల్ అధికారులు



నాగారం, జూలై 2:-(వాయిస్ టుడే): నాగారం డివిజన్‌లో అనుమతి లేకుండా అదనపు అంతస్తు నిర్మాణం చేపట్టిన భవనంపై మున్సిపల్ అధికారులు గురువారం కూల్చివేత చర్యలు చేపట్టారు. డివిజన్‌లోని నేషనల్ మార్ట్ ఎదురుగా ఉన్న హెచ్.నెం. 9-949 భవనంలో సంబంధిత శాఖ అనుమతులు లేకుండా అదనపు అంతస్తు నిర్మిస్తున్నారని స్థానికులు చేసిన ఫిర్యాదుల మేరకు అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించి, అక్రమంగా నిర్మించిన భాగాన్ని కూల్చివేశారు. అనుమతులు లేకుండా లేదా మంజూరైన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. భవన నిర్మాణాలు ప్రారంభించే ముందు తప్పనిసరిగా సంబంధిత శాఖల నుంచి అనుమతులు పొందాలని ప్రజలకు సూచించారు.



## చీరాలలో సర్ కార్యక్రమం

నాగారం, జూలై 2:-(వాయిస్ టుడే): చీర్యాల బూత్ నెంబర్ 287లో "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్" (సర్) లో ఇంటి ఇంటికి ఎమ్యూనరేషన్ ఫార్మ్స్ ఇచ్చే కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, చీర్యాల మాజీ ఉపసర్పంచ్ జిల్లాల తిరుమల రెడ్డి, భరాస మండల నాయకులు, చీర్యాల మాజీ ఉపసర్పంచ్ బర్లపాటి రమేష్, కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు రేగు జంగయ్య, జీపీఓ ఏర్పుల స్వప్న, విఆర్ఎ కోల రమేష్ యాదవ్, బిఎల్ఓలు తునికి భాగ్య లక్ష్మీ, కోల అనురాధ, బోడ భాగ్యమ్మ, భారాస నాయకులు బర్లపాటి వెంకటేష్ మరియు బిఎల్ఎలతో కలసి పాల్గొన్న దృశ్యాలు. ఈ సందర్భంగా జిల్లాల తిరుమల రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బిఎల్ఎ-2ల పాత్ర కీలకమని, మరియు రాజకీయ పార్టీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఖచ్చితమైన ఓటర్ల జాబితా కీలకమని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా పనిచేయాలని కోరారు."ప్రతి ఓటు విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా కృషి చేద్దాం అని అన్నారు.



## అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్

కుత్బుల్లాపూర్ జులై 02(వాయిస్ టుడే): జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సంజీపురి కాలనీలో పోచమ్మ దేవాలయం పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్లు కొలుకుల జగన్ మంత్రి సత్యనారాయణ. సురేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. తెలంగాణ సాంప్రదాయంలో ముఖ్యంగా హైదరాబాద్ సంస్కృతిలో బోనాల ఉత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని అన్నారు. భగవంతుని పూజించడం వలన క్రమశిక్షణ తో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. బోనాల ఉత్సవాలకు ఆలయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిన కమిటీ సభ్యులకు మరోసారి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు. అరుణ్ రెడ్డి.. ప్రవీణ్ కుమార్ గుప్తా. శ్రీనివాస్. బాలు. శ్రీకాంత్ రెడ్డి.ఉపేందర్ రెడ్డి. బాబు. భాస్కర్. సునీల్ రెడ్డి సంపత్ రెడ్డి. బసవేశ్వర్. తదితరులు పాల్గొన్నారు.

## కవిత అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం

### తెలంగాణ ఆదివాసి రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు



నాచారం (వాయిస్ టుడే):ధర్నా చేస్తున్న టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కవితను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఆదివాసి రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు అన్నారు. ఈ అరెస్టును కార్మికులు కర్షకులు విద్యార్థులు మేధావులు ప్రజలు తీవ్రంగా ఖండించాలని కోరారు. గురువారం లోయర్ ట్యాంక్ బండ్ లో కవిత అరెస్టును నిరసిస్తూ ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు పూర్తవుతున్న తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాల పంపిణీ చేయకుండా మరుగున పరిచినందుకే కవిత నిరసన చేపట్టారని తెలిపారు. ఉద్యమకారులకు మద్దతుగా పోరాటం చేస్తున్న కవితకు అండగా నిలబడి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్త విద్యార్థి ఉద్యమం తప్పదు

**ప్రభుత్వ విద్యా విధానం పేద, బీసీ విద్యార్థులకు అనుకూలంగా లేదని గుజ్జ సత్యం విమర్శ**

**పాలమూరు యూనివర్సిటీలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరాహార దీక్ష -- అధ్యాపకులు, విద్యార్థి సంఘాలు, సామాజిక సంస్థల సంఘీభావం**




మహబూబ్‌నగర్, జూలై 02: తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమం ఉధృతం అవుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం హెచ్చరించారు. పాలమూరు యూనివర్సిటీలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన లిలి"ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధన దీక్ష"లిలిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి యూనివర్సిటీకి చెందిన పలువురు ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, సామాజిక సంస్థల నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా గుజ్జ సత్యం మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత విద్యను సామాజిక న్యాయ సాధనంగా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీలు ఆచరణలో బలహీనపడుతున్నాయనే ఆందోళన వ్యక్తం చేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం కారణంగా వేలాది మంది విద్యార్థులు కాలేజీల్లో అవమానాలు ఎదుర్కొంటున్నారని, పరీక్షలకు అనుమతించకపోవడం, సర్టిఫికెట్లు నిలిపివేయడం, చదువు మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా విధానంపై స్పందిస్తూ, విధానాల కంటే వాటి అమలే ముఖ్యమని పేర్కొన్నారు. విద్యా సంస్కరణల పేరుతో తీసుకొచ్చే ప్రతి నిర్ణయం పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల చదువుకు భరోసా కల్పించాలే తప్ప, వారి ఆర్థిక భారం పెంచేలా ఉండకూడదన్నారు. "విద్యార్థికి అందుబాటులో లేని విధానం ఎంత ఆకర్షణీయంగా కనిపించినా అది ప్రజా విధానం కాదు" అని వ్యాఖ్యానించారు.

ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడం ఆ ప్రకటనలకు విరుద్ధమని విమర్శించారు. విద్యార్థులకు చెల్లించాల్సిన నిధులు సమయానికి విడుదల కాకపోతే, ఉన్నత విద్య పేద కుటుంబాలకు అందని ద్రాక్షగా మారే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రైవేట్, ప్రొఫెషనల్ కళాశాలలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, దాని ప్రభావం నేరుగా విద్యార్థులపై పడుతోందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వ్యవస్థను బలోపేతం చేయకుండా విద్యా రంగంలో నాణ్యత గురించి మాట్లాడటం అసంపూర్ణమని అన్నారు.

"ప్రభుత్వాలు మారొచ్చు... విధానాలు మారొచ్చు... కానీ పేద విద్యార్థి చదివే హక్కు మారకూడదు. విద్యపై పెట్టుబడి ఖర్చు కాదు... అది రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టుబడి" అని గుజ్జ సత్యం స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు, భవిష్యత్తులో ఆలస్యం జరగకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

### విద్యార్థుల పోరాటానికి అందరూ అండగా నిలవాలి: తాయప్ప

పాలమూరు యూనివర్సిటీ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు తాయప్ప మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ నిరాహార దీక్ష ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా కాదని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు చేపట్టిన ప్రజాస్వామ్య ఉద్యమమని పేర్కొన్నారు.

### అధ్యాపకులు, విద్యార్థి సంఘాల సంఘీభావం

కార్యక్రమంలో పాల్గొన్న పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, విద్యా అవకాశాలు ఆర్థిక స్థోమతపై ఆధారపడే పరిస్థితి ఏర్పడకూడదని అభిప్రాయపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం సామాజిక న్యాయానికి కీలకమైన సాధనమని, ప్రభుత్వం దీనిపై అత్యవసరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

### ప్రధాన డిమాండ్లు

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.

ఫీజుల కారణంగా విద్యార్థులను పరీక్షలకు అనుమతించకుండా ఉండే చర్యలను నిలిపివేయాలి.

సర్టిఫికెట్లు నిలిపివేయడంపై కఠిన ఆదేశాలు జారీ చేయాలి.

కొత్త విద్యా విధానంపై విద్యార్థి సంఘాలు, అధ్యాపకులు, నిపుణులతో విస్తృత చర్చ నిర్వహించాలి.

పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల ఉన్నత విద్యకు పూర్తి రక్షణ కల్పించే విధానాలను అమలు చేయాలి.

### పలువురు ప్రముఖుల పాల్గొనడం

ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షురాలు మట్ట జయంతి గౌడ్, నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్, పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ కుమారస్వామి, నాన్-టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామ్మోహన్, జీబీసీ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నగర్, మాజీ డీఈఓ విజయ్ కుమార్, సారంగి లక్ష్మీకాంత్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్, స్వేరో రాష్ట్ర అధ్యక్షుడు పవన్, లంబాడి హక్కుల సమితి అధ్యక్షుడు సాయి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు నరేందర్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శివాజీ, వివిధ బీసీ విద్యార్థి సంఘాల నాయకులు, పరిశోధక విద్యార్థులు, ప్రొఫెసర్లు, సామాజిక సంస్థల ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. వక్తలందరూ ఏకగ్రీవంగా మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్‌లను ఆలస్యం చేయడం వల్ల పేద, బీసీ విద్యార్థుల ఉన్నత విద్య ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్ నిధులను విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కళాశాలలను కలుపుకొని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యపై పెట్టుబడి పెట్టడం రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టుబడి అని, పేద విద్యార్థి చదువుకు రక్షణ కల్పించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని స్పష్టం చేశారు.



## నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ అభివృద్ధిపై సమగ్ర సమీక్ష నిర్వహించిన బి.ఆర్.ఎస్.ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద

కుత్బుల్లాపూర్ జులై 02(వాయిస్ టుడే): చెరువుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులకు పలు కీలక ఆదేశాలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా బి.ఆర్.ఎస్.ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద ప్రగతి నగర్‌లోని నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని చెరువుల అభివృద్ధి, సుందరీకరణతో పాటు వాటి పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో ఎమ్మెల్యే సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా తుర్క చెరువు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే పత్తికుంట చెరువు, మేడికుంట చెరువు, అంబీర్ చెరువు అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు.

అనంతరం సర్కిల్ పరిధిలో జరుగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు, సీసీ రోడ్ల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. కొత్త వీధి దీపాల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణను మరింత పటిష్టంగా చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. అలాగే 2బీహెచ్‌కే గృహ సముదాయాల్లో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం చేపట్టిన ఎస్ఐఆర్ ( ఎస్ఐఆర్ ) కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, ప్రజల్లో అవగాహన కల్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను కోరారు.

నిజాంపేట సర్కిల్ అభివృద్ధికి సంబంధించిన ప్రతి పనిని నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కె.పి. వివేకానంద ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నిజాంపేట సర్కిల్ ఉప కమిషనర్ షబ్బీర్ అలీ, డిప్యూటీ తహశీల్దారు ఉమామహేశ్వర రెడ్డి, ఇరిగేషన్ డిఈ రూప్ లాల్, వీరారెడ్డి, ఎఈ రవి, ఇంజనీరింగ్ శాఖ, జలమండలి శాఖ అధికారులు మరియు నిజాంపేట కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నల్లపోచమ్మ అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండాలి

### టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్



కూకట్ పల్లి 2 జూలై (వాయిస్ టుడే): అల్లాపూర్, డివిజన్-255: శ్రీ శ్రీ శ్రీ నల్లపోచమ్మ నూతన దేవాలయ యంత్ర విగ్రహ సింహవాహన శిఖర ప్రతిష్ఠ మహోత్సవానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు అక్కినాపురం లక్ష్మణ్ గౌడ్ ఆయనకు ఘన స్వాగతం పలికి ఆలయానికి ఆహ్వానించారు. అనంతరం బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నల్లపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో సత్కరించారు.ఈ సందర్భంగా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, "నల్లపోచమ్మ అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. ఆధ్యాత్మిక విలువలు సమాజంలో ఐక్యత, సోదరభావం, సామరస్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ చైర్‌పర్సన్, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, దేవాలయ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ రాకతో మహోత్సవం మరింత వైభవంగా సాగిందని అల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు అక్కినాపురం లక్ష్మణ్ గౌడ్ తెలిపారు.






# వినూత్న పద్ధతిలో సెయింట్ జోసెఫ్ విద్యార్థుల ఎన్నికలు

## ఓటింగ్‌లో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు

కంటోన్మెంట్ : జులై 2 (వాయిస్ టుడే ప్రతినిధి): తిరుమలగిరి సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వినూత్న పద్ధతిలో పాఠశాల విద్యార్థి మంత్రివర్గ ఎన్నికను నిర్వహించారు. భవిష్యత్తు సాంకేతిక ప్రపంచానికి విద్యార్థులను సిద్ధం చేసే విధంగా నిర్మాణాత్మక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.. పాఠశాలలోని ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థుల బృందం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని కృత్రిమ మేధస్సు ద్వారా ఓటింగ్ ప్రక్రియను నిర్వహించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాన్ని తయారు చేశారు. శాస్త్రీయ దృక్పథాన్ని సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పాఠశాల ప్రధానోపా ధ్యాయులు మైకేల్ డిజౌజా స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, బాధ్యత, ప్రజాస్వామ్య విలువలతో పాటు సాంకేతికతలో తమను తాము మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుందని అన్నారు. చిన్న వయసులోనే విద్యార్థులు గొప్ప ఆవిష్కరణలు చేస్తుండడం గర్వకారణం అని అన్నారు. విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా , ప్రోగ్రామింగ్ యొక్క ప్రాథమిక అంశాలను నేర్చుకోవడం, సమస్యలను విశ్లేషించి పరిష్కారాలను కనుగొనే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం వంటి మెలుకువలు నేర్చుకు నేందుకు ఎంతగానో దోహదపడుతుందని పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు మాటా ్లడుతూ పాఠశాలలో విద్యాబోధనతోపాటు ప్రస్తుత పోటీ ప్రపంచంతో పోటీపడే విధంగా నూతన సంస్కరణలను నేర్చుకుంటున్నట్లు విద్యార్థులు తెలిపారు. ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థుల బృందం సరికొత్త ఆలోచనతో పాఠశాల మంత్రివర్గ ఎన్నికల కోసం కృత్రిమ మేధావులు ఉపయోగించి ఎన్నికల ఓటింగ్ యంత్రాన్ని రూపొందించినట్లు విద్యార్థులు పేర్కొన్నారు. అధ్యాపకుల ప్రోత్సాహంతో తాము కొత్త విషయాలను నేర్చుకోవడంతోపాటు ఆచరణలోకి తీసుకువచ్చి విజయం సాధిస్తున్నట్లు విద్యార్థులు వెల్లడిం చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ప్రాథమిక హక్కుగా భావించాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తూ తాము ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకరం చుట్టినట్లు పేర్కొన్నారు. ఎన్నికల ఓటింగ్ యంత్రం తయారు చేయడంతో పాటు తమ పాఠశాలలోని ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఉన్నత విలువలతో కూడిన విద్యార్థి నాయకులను ఎన్నుకునేందుకు కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



## గన్‌పార్క్‌లో బహిరంగ చర్చకు కాంగ్రెస్ మంత్రులు..

## పాల్గొన్న మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి

హైదరాబాద్, (వాయిస్ టుడే): ప్రజా ప్రభుత్వంపై మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్ చేస్తున్న నిరాధార ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు రాష్ట్ర మంత్రులు గన్‌పార్క్ వద్ద బహిరంగ చర్చకు సిద్ధమయ్యారు. మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్ విసిరిన సవాల్‌ను స్వీకరిస్తూ రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఇతర కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కలిసి గన్‌పార్క్‌కు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి కూడా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల ముందే వాస్తవాలను వెల్లడించేందుకు కాంగ్రెస్ నాయకులు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని కాంగ్రెస్ నాయకులు పేర్కొంటూ, ప్రజల సమక్షంలోనే అన్ని అంశాలపై చర్చించేందుకు సిద్ధమని మరోసారి స్పష్టం చేశారు.

## తార్నాకలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో మురారి స్మిత్ కోటేష్ గౌడ్



నాచారం (వాయిస్ టుడే): కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా తార్నాక డివిజన్‌లో గురువారం ఇంటింటి ఓటరు ధ్రువీకరణ, ఫారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి. పద్మారావు గౌడ్ మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మురారి స్మిత్ కోటేష్ గౌడ్ చురుకుగా పాల్గొన్నారు. బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) అఖిలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన ఫారాలను పంపిణీ చేశారు. అలాగే ఓటర్ల గుర్తింపు వివరాలను ధ్రువీకరిస్తూ, కొత్త ఓటరు నమోదు, పేర్ల సవరణ, చిరునామా మార్పులు, ఇతర వివరాల నవీకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మురారి స్మిత్ కోటేష్ గౌడ్ మాట్లాడుతూ, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పెండింగ్ ఫీజు లను చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమం తప్పదు

మహబూబ్నగర్ జిల్లా జూలై 2 (వాయిస్ టుడే) :పాలమూరు యూనివర్సిటీ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు తాయప్ప, మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ నిరాహార దీక్ష ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా కాదని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు చేపట్టిన ప్రజాస్వామ్య ఉద్యమమని పేర్కొన్నారు. రాష్ట్రంలో మా బడుగు బలహీన వర్గాల నుంచి వివిధ రకాల పనులు పొంది మీరు విలాస భోగాలు పొందుతున్నారని మా డబ్బులను మాకు రియంబర్స్మెంట్ రూపంలో ఇవ్వడానికి మీకు మనసు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఫ్లీజ్ రియంబర్స్మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల ఆగ్రహానికి లోనవుతున్నారు. విద్యార్థుల ఆగ్రహం ఓట్లుగా మారితే పీఠాలు కదులుతాయి అన్నారు వీలైనంత తొందరగా 14 లక్షల విద్యార్థులకు సంబంధించిన తొమ్మిది వేల కోట్ల ఫ్లీజ్ రియంబర్స్మెంట్ ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 8 9 లను రద్దు చేయాలని అన్నారు. ప్రభుత్వ విద్యా విధానం పేద, బీసీ విద్యార్థులకు అనుకూలంగా లేదని గుజ్జ సత్యం విమర్శ.

పాలమూరు యూనివర్సిటీలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరాహార దీక్ష అధ్యాపకులు, విద్యార్థి సంఘాల సంఘీభావం



తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమం ఉధృతం అవుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం హెచ్చరించారు. విద్యా సంస్కరణల పేరుతో తీసుకొచ్చే ప్రతి నిర్ణయం పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల చదువుకు ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడం ఆ ప్రకటనలకు విరుద్ధమని ఆయన విమర్శించారు. విద్యార్థులకు చెల్లించాల్సిన నిధులు సమయానికి విడుదల కాకపోతే, ఉన్నత విద్య పేద కుటుంబాలకు అందని ద్రాక్షగా మారే ప్రమాదం ఉందన్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో అనేక ప్రైవేట్, ప్రొఫెషనల్ కళాశాలలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, దాని ప్రభావం నేరుగా విద్యార్థులపైనే పడుతోందని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వ్యవస్థను బలోపేతం చేయకుండా విద్యా రంగంలో నాణ్యత గురించి మాట్లాడటం అసంపూర్ణమని అన్నారు.ప్రభుత్వాలు మారొచ్చు... విధానాలు మారొచ్చు... కానీ పేద విద్యార్థి చదివే హక్కు మారకూడదు. విద్యపై పెట్టుబడి ఖర్చు కాదు... అది రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టుబడి” అని గుజ్జ సత్యం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

ఫ్లీజ్ వంకాయలు చెల్లించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనకు విద్యార్థి సంఘాలు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ జేఏసీ చైర్మన్ కుమారస్వామి పాల్గొని దీక్ష ప్రారంభించడం జరిగింది అదేవిధంగా బీసీ సమాజ్ అధ్యక్షుడు శ్రీనివాస్ సాగర్, సారంగి లక్ష్మీకాంత్, విజయ్ కుమార్ , బుగ్గన, రామ్మోహన్, జి పర్వతాలు, బురానా, విద్యార్థి నాయకులుఎమ్మెస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ స్వేరో అధ్యక్షులు పవన్, లంబాడి హక్కుల సమితి అధ్యక్షుడు సాయి శేఖర్, తచ్చెర తదితర బీసీ విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

## భరత్‌నగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేసిన కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు



కూకట్ పల్లి : జులై 2(వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గంలోని భరత్‌నగర్ కాలనీలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు గురువారం గాంధీభవన్‌లో తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు గారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన వాణిజ్య సముదాయాల కారణంగా కాలనీలోకి వెళ్లేందుకు సరైన మార్గం లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అలాగే భరత్‌నగర్‌లోని ఫ్రీ టర్న్ వద్ద ఏర్పాటు చేసిన “నో యూ టర్న్” బోర్డు వల్ల ప్రజలకు, వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని తెలిపారు. ఈ అంశంపై ఇప్పటికే పలు ప్రముఖ వార్తాపత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పటికీ, ట్రాఫిక్ పోలీసులు, అప్పటి జీహెచ్ఎంసీ అధికారులు, ప్రస్తుతం సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలోని రహదారి, ట్రాఫిక్, మౌలిక సదుపాయాల సమస్యలను పరిశీలించి, ఫ్రీ టర్న్ వద్ద ఉన్న “నో యూ టర్న్” బోర్డును తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి, కమిటీ సభ్యులు వెంకటేష్ యాదవ్, నాగేశ్వర్‌రావు బాబు, నరేష్ కుమార్, మధుకర్, వెంకటేష్, భిక్షపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## దివంగత నేత గొట్టిముక్కల పద్మారావుకు ఘన నివాళులు అర్పించిన బండి రమేష్

కూకట్‌పల్లి, జులై 2(వాయిస్ టుడే): దివంగత రాజకీయ నాయకుడు గొట్టిముక్కల పద్మారావు దశదిన కార్యక్రమం గురువారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వివేకానంద నగర్ కాలనీలో ఉన్న ఆయన స్వగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధి కోసం, ఉద్యమాల సమయంలో గొట్టిముక్కల పద్మారావు అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించడం ద్వారా నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## ఏవీబీ పురం రోడ్ నంబర్-11లో డ్రైనేజీ, వాటర్ లైన్ ఏర్పాటు చేయాలని వినతి

### - జనసేన నాయకులు, కాలనీ వాసులు

కూకట్‌పల్లి, జులై 2(వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గంలోని భారత్‌నగర్ పరిధిలోని ఏవీబీ పురం రోడ్ నంబర్–11లో డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ సౌకర్యాలు కల్పించాలని కోరుతూ జనసేన నాయకులు, కాలనీ వాసులు వాటర్ వర్క్స్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. జనసేన పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ మాజీ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ సూచనల మేరకు, ఏవీబీ పురం కాలనీ అధ్యక్షుడు సీమాద్రి, జనసేన నాయకులు, స్థానిక కాలనీ వాసులు కలిసి భారత్‌నగర్ వాటర్ వర్క్స్ విభాగం మేనేజర్ సయ్యద్ అబ్దుల్ జాకేను కలిసి సమస్యను వివరించారు.

ఏవీబీ పురం రోడ్ నంబర్–11లో సుమారు 100 కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ ఇప్పటివరకు డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. వినతిపై వెంటనే స్పందించిన వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ స్వయంగా ఏవీబీ పురం రోడ్ నంబర్–11ను సందర్శించి, స్థానిక కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలను పరిశీలించారు. అవసరమైన చర్యలు తీసుకుని సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. త్వరిత స్పందన చూపిన వాటర్ వర్క్స్ అధికారులకు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, జనసేన నాయకులు, కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, టి. ప్రసాద్, దుర్యోధన, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



## డ్రోన్ సేవలు ప్రారంభించిన జిల్లా కోపరేట్ అధికారి కిరణ్ కుమార్

నర్సాపూర్ (వాయిస్ టుడే) : నియోజకవర్గంలో హత్నూర మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ దుర్గారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా సహకార వారోత్సవాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆధునిక పద్ధతి ద్వారా వ్యవసాయం చేసి లాభాలు గడించాలని జిల్లా అధికారులు రైతులకు అవగాహన కల్పించారు అలాగే ఈ కార్యక్రమంలో డ్రోన్ వినియోగం గురించి వివరించారు. డ్రోన్ల ద్వారా రైతులు వివిధ రకాల పంటలకు క్రిమి సంహారక మందులను పిచికారి చేయవచ్చని డ్రోన్ మందులను పంటలపై పిచికారి చేయడం సులభతరం అవుతుందని రైతు శ్రమ తగ్గుతుందని అన్నారు. రైతులు ఫీూ లలో సభ్యత్వం పొంది మార్కెటింగ్. నాణ్యమైన వ్యవసాయ ఇన్ పుట్ల సరఫరా ఆర్థిక సహాయం శిక్షణ మరియు సమాచాభివృద్ధి వంటి ప్రయోజనాలను పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంబంధిత వివిధ శాఖల జిల్లా అధికారులు మండలాధికారులు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన సిరిపురం మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్

నర్సాపూర్ (వాయిస్ టుడే) : హత్నూర మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన మహమ్మద్ హాఫీజ్ తన అనారోగ్య కారణంగా ఆసుపత్రి బిల్లు కోసం సీఎంఆర్ కు దరఖాస్తు చేసుకోగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి సహకారంతో ఆయనకు 19500 చెక్కు గురువారం నాడు అందజేయడం జరిగింది ఈ సందర్భంగా సిరిపురం మాజీ సర్పంచ్ నరేందర్ మాట్లాడుతూ పేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతో ఉపయోగపడతాయని ఆయన అన్నారు ఈ అవకాశాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లారెడ్డి నాయకులు నాయకులు సారా పండు గౌడ్ నాగేష్ గౌడ్ నారాయణ మహిపాల్ లబ్ధిదారుడుతదితరులు పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా చేపట్టాలి

**జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులునర్సింహారెడ్డి**

ఝరాసంగం జూలై 02 (వాయిస్ టుడే) : జహీరాబాద్ మండలంలోని శేఖాపూర్ గ్రామంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై గురువారం ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ చేష్మోద్దీన్, మాజీ ఎంపీటీసీ నర్సింహులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పట్లోళ్ళ నర్సింహారెడ్డి పాల్గొని మాట్లాడారు. బూత్ స్థాయి ఏజెంట్లు బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో అత్యంత అప్రమత్తంగా ఉంటూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని ఆయన సూచించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, 2002 ఓటర్ల డేటా మ్యాపింగ్ మరియు సవరణలో కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వి.రాములు, సిడిసి డైరెక్టర్ మల్లారెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ ఇమామ్ పటేల్, సీనియర్ నాయకులు నర్సింహులు, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు జగన్, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, బీఎల్వోలు, బీఎల్ఏలతో పాటు పలువురు గ్రామ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు సుర దేవరాజు

సిరిసిల్ల, జూలై 02 (వాయిస్ టుడే): కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడి గా నూతనంగా ఎన్నికైన సుర దేవరాజు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుర దేవరాజు కు శుభాకాంక్షలు తెలిపిన ఆది శ్రీనివాస్, పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని సుర దేవరాజు తెలిపారు.

# ప్రజల మేలు కోసం తపనపడే గొప్ప వ్యక్తి సోనీ భాయ్

**ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**

**భావోద్వేగానికి లోనైన వినయ్ భాస్కర్**

**బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకుడు సోనీ సంతాప సభ**

**హాజరైన రాష్ట్ర మైనార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు,వివిధ పార్టీల నాయకులు**



కాజీపేట, (వాయిస్ టుడే) : ప్రజల మేలు కోసం తపన పడే గొప్ప వ్యక్తి సోనీ భాయ్ అని..ప్రజల మంచి కోసం ఏదైనా చేయడానికి ఎప్పుడూ వెనకడుగు వేయలేదని..అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సహాయం చేయాలనే తపనతో ఆయన ఉండేవారని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్,మాజీ ఎమ్మెల్యే,హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. కాజీపేటకు చెందిన ఉద్యమకారుడు,పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ యాకుబ్ అలియాస్ సోనీ ఇటీవల మరణించగా ఆయన సంతాప సభను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం బాపూజీనగర్‌లోని పోచమ్మగుడి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మాజీ చీఫ్ విప్,మాజీ ఎమ్మెల్యే సోనీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి,కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. అనంతరం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ నలుగురికి మంచి చేయాలని,సమాజానికి సేవ చేయాలని నిరంతరం ఆలోచించే గొప్ప వ్యక్తి సోనీ భాయ్ అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో సైతం తనతో కలిసి ముందుండి పోరాడారని గుర్తు చేశారు. తన జీవితంలో సోనీ భాయ్ లేకపోవడాన్ని తాను ఊహించలేదని,తనకు ఆయనతో 40 సంవత్సరాలకు పైగా అనుబంధం ఉందన్నారు. మొదటి నుంచి చివరి వరకు తన వెన్నంటి నిలిచిన వ్యక్తి సోనీ భాయ్ అని,పార్టీ కార్యకర్త కంటే కుటుంబ సభ్యుడిగా ఉన్నారని పేర్కొన్నారు. ఆయన స్మారకార్థం మదర్సా చిన్నారులకు సాయం అందిస్తానని ప్రకటించారు.

**భావోద్వేగానికి లోనైన వినయ్..**

బీఆర్ఎస్ నాయకుడు సోనీ కి, తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ సోనీ బాయ్ తనకు సొంత సోదరుడిగా ఉండేవాడని,ఎల్లప్పుడు తన యోగ క్షేమాలు కోరేవాడని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కొన్ని విషయాలను గుర్తుచేసుకుంటూ బరువెక్కిన హృదయంతో తన ఆవేదనను ఆపుకోలేక వినయ్ భాస్కర్ భావోద్వేగం చెందారు. అనంతరం ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మాట్లాడుతూ మహ్మద్ యాకుబ్ సోనీ భాయ్ గొప్ప మనిషి,గొప్ప ఉద్యమకారుడని పేర్కొన్నారు. ప్రజాసేవ కోసం ఎంతో శ్రమించారని..దాస్యం వినయ్ భాస్కర్‌కు నమ్మకమైన అనుచరుడిగా,విలువలు కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందారని అన్నారు. పార్టీలకు అతీతంగా సంతాప సభ నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ సమావేశాన్ని నిర్వహించిన వినయ్ భాస్కర్‌తో పాటు బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. మైనార్టీ సీనియర్ నాయకుడు మాట్లాడుతూ ప్రజల కోసం నాయకులను ఒప్పించి మంచి పనులు చేయించే ప్రయత్నం నిరంతరం చేసిన వ్యక్తి సోనీ భాయ్ అని అన్నారు. కేవలం ప్రజాసేవకే అంకితమై ఎలాంటి పదవులు లేదా గుర్తింపులు ఆశించని నికార్సైన నాయకుడిగా ఆయనను అభివర్ణించారు. వినయ్ భాస్కర్ మంచి మిత్రుడిని కోల్పోయారని..సోనీ భాయ్‌కు నిజమైన నివాళి ప్రజలకు మంచి చేయడమేనని పేర్కొన్నారు. సోనీ భాయ్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ యాదవ రెడ్డి,మాజీ మేయర్ సిరాజుద్దీన్, తాజా మాజీ కార్పొరేటర్లు సంకు నర్సింగ్, సోదా కిరణ్,నాయకులు నార్లగిరి రమేష్,జోరిక రమేష్, దశరథం, సుంచు కృష్ణ, పాలడుగుల శివకుమార్, బరిగెల వినయ్,బొల్లె కుమార్,నయీం జుబేర్,మాచర్ల ప్రభాకర్, కుమ్మరి రాజ్ కుమార్,మహిమూద్,దువ్వ కనకరాజు,కోండ్ర శంకర్, తండమల్ల వేణు,మరియాల కృష్ణ,రాంచందర్,బాబీ,విజయ్,రాజు,రాబర్ట్,చందు తదితరులు పాల్గొన్నారు.



## ఝరాసంగం మండలంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం

**జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు**

ఝరాసంగం జులై 02 (వాయిస్ టుడే) : ఝరాసంగం మండల కేంద్రంతో పాటు ప్యాలవరం, చిలెమామిడి గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్ల పనులను ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు గురువారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మాజీ ఎంపీపీ బొగ్గల సంగమేశ్వర్, యువ నాయకులు కొనింటి మిథున్‌రాజ్ పాల్గొన్నారు.

ఝరాసంగం గ్రామంలో మాజీ సర్పంచ్ ఫోరం అధ్యక్షులుజగదీష్, గ్రామ సర్పంచ్ వినోద్ బాలరాజ్, పట్టణ అధ్యక్షులు.ఎజాస్ బాబా, మాజీ ఉపసర్పంచ్ హమీద్ సాబ్, మమత అనిల్, ప్రకాష్, నవీన్, సంగమేశ్వర్, తేజం, ప్రవీణ్, ఎంపీ నాగన్న, సజ్జన్, ఫయాజ్, విలాస్, అజీమ్, విజయ్, బి. సంగన్న, దత్తు, గోపాల్, అజర్ తదితరులు పాల్గొన్నారు. ప్యాలవరం గ్రామంలో సర్పంచ్ నర్మదారాణి రాజ్‌కుమార్, ఉపసర్పంచ్ రవి, మాజీ సర్పంచ్ బసవరాజ్, మాజీ ఉపసర్పంచ్ మాణిక్ యాదవ్, వార్డు సభ్యులు శ్రీకృష్ణతో పాటు గాండ్ల సంగన్న, బసవరాజ్, శిరోమణి, అంజన్న, మహేష్, లక్ష్మణ్, బక్కన్న తదితరులు హాజరయ్యారు. చిలెమామిడి గ్రామంలో సర్పంచ్ జైరాజ్, ఉపసర్పంచ్ రాచన్న, గోపాలకృష్ణ, రవి, సత్తార్ మియా, జర్నయ్య, అంజన్న, రాజు, వసంత్, యేసు, నరేష్‌తో పాటు గ్రామ ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికులపై సవతితల్లి ప్రేమ తగదు



తొర్రూరు, జులై 2 వాయిస్ టుడే : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బందికి నేరుగా వేతనాలు అందిస్తామని ఇచ్చిన మాటను రాష్ట్ర ప్రభుత్వం తప్పిందని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్( టియుసిఐ అనుబంధం హెచ్ -106 ) రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. గురువారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా కార్మికుల వేతనాలు అందిస్తామని చెప్పిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క, రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్,ఇతర అధికారులు ఇచ్చిన హామీలు నీటిమీద రాతల్లా మారాయని రవి ఆరోపించారు. టీఎస్ బి పాస్ లో వేయటం వల్ల కార్మికుడి వేతనంపై సర్పంచ్, ఉప సర్పంచ్ సెక్రటరీలు రాజకీయ కారణాలు, వ్యక్తిగత సమస్యలను జోడించే ప్రమాదం ఉందని అన్నారు. కాబట్టి నేరుగా కార్మికుల అకౌంట్ లోనే వేతనాలు వేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంత కార్మికుల కోసం జీవో నెంబర్ 6 ను మూడు కేటగిరీలుగా విభజించిన రాష్ట్ర ప్రభుత్వం ఏ కేటగిరి లోను గ్రామపంచాయతీ కార్మికులను చేర్చకపోవడం పల్లెలను శుభ్రంగా ఉంచుతున్న వారి కష్టాన్ని నిర్లక్ష్యం చేయటమేనని అన్నారు . పెరిగిన పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలు, ఇతర వినియోగ వస్తువుల ధరల వల్ల గ్రామపంచాయతీ కార్మికుని బ్రతుకు మరింత భారం చేస్తుందని అన్నారు. వెంటనే కార్మికుల వేతనాలు పెంచాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే రానున్న రోజులలో ఇతర కార్మిక సంఘాలను కలుపుకొని ఐక్యంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు పాద్యాబీకు,రాష్ట్ర నాయకులు గాదరబోయిన సంతోష్,మండల అధ్యక్షుడు గుండాల సోమనరసయ్య, పెద్దవంగర మండల నాయకులు కుమార్ , శ్రీకాంత్, వేణు,ప్రమోద్, యాకయ్య,రాము, వెంకన్న, యాకయ్య, దస్రు తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**కాజీపేటలో భూముల రీసర్వేపై అవగాహన కార్యక్రమం**



హనుమకొండ జిల్లా, (వాయిస్ టుడే) : భూములను రీ సర్వే చేయడం ద్వారా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం జరుగుతుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం అమ్మవారిపేటలో భూముల కొలతల శాఖ ఆధ్వర్యంలో గ్రామస్తులకు భూముల రీ సర్వే పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ భూముల వద్దకు ప్రత్యక్షంగా వెళ్లి రీ సర్వే జరిగినప్పుడు చాలావరకు భూ సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. దశబ్దాల తరువాత భూముల రీ సర్వే జరిగిందని,మళ్లీ ఇప్పుడు భూముల రీ సర్వే జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో భూముల హద్దులకు సంబంధించిన రాళ్లు దొరకడం లేదన్నారు. సరిహద్దులను నిర్ణయించడం, సర్వే నెంబర్ ను గుర్తించడంలో సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. సర్వే చేపట్టడంలో కొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందన్నారు. భూముల కొలతల కోసం కొత్తగా రోవర్స్,డీజీపీఎస్ ఉన్నాయన్నారు. ఒక ఇంచు భూమి కూడా తప్పిపోకుండా కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డిజిటల్ సర్వే పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో భూముల రీ సర్వే చేపట్టినట్లు చెప్పారు. భూముల రీసర్వే లో భాగంగా మొదటి విడతలో రెండు గ్రామాలలో భూముల రీ సర్వే ప్రక్రియ సాగుతుందన్నారు.

జిల్లాలో భూముల రీ సర్వే కోసం 70 గ్రామాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగానే అమ్మవారిపేటలో భూముల రీ సర్వే చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భూముల రీసర్వే లో మొదటగా గ్రామ హద్దులు నిర్ణయిస్తారని,తదుపరి ప్రభుత్వ భూములను,పట్టా భూముల మార్కింగ్ జరుగుతుందన్నారు. చాలావరకు స్థానికంగా నెలకొన్న భూ వివాదాలు రీ సర్వే చేయడం ద్వారా పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 50 శాతం వరకు భూములకు సంబంధించిన అంశాలపైనే దరఖాస్తులు వస్తుంటాయని తెలిపారు. భూమిపై ఏ రైతుకు ఎంత భూమి ఉందనే వివరాలను చుట్టుపక్కల రైతులను విచారించి రీ సర్వే జరిగినప్పుడు భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఒకవేళ హద్దులు నిర్ణయించని పక్షంలో ఆర్డీవో,ఆ తదుపరి కలెక్టర్ కు ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. భూముల రీ సర్వే అనేది ఒక మంచి అవకాశం అని, లైసెన్స్డ్ సర్వేయర్లు రీ సర్వేలో పాల్గొంటున్నారని చెప్పారు. భూముల రీ సర్వేకు రైతులు,ప్రజలు సహకారంతోనే పూర్తవుతుందని కోరారు. జియో కోఆర్డినేట్స్ తో ఒక్కసారి భూ హద్దులు ఫిక్స్ అయితే ఎక్కడ ఉన్న చూసుకోవచ్చని..వేరే వ్యక్తులు వచ్చి క్లెయిమ్ చేయడానికి వీలు లేకుండా ఉంటుందన్నారు. ఈ అవగాహన సదస్సులో కాజీపేట తహసీల్దార్ రాజు,సర్వే విభాగం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సారంగపాణి భూముల రీ సర్వే గురించి గ్రామస్తులకు వివరించారు. గ్రామానికి చెందిన పలువురు భూ సమస్యలను గురించి కలెక్టర్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో భూములు కొలతల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్,ఇతర అధికారులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్**

గురువారం కాజీపేట మండలం అమ్మవారిపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి విద్యా బోధన,విద్యార్థుల హాజరు,మౌలిక సదుపాయాలు, పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలను పరిశీలించారు. విద్యార్థుల్లో ఇంగ్లీష్, గణితంతో పాటు ఇతర సబ్జెక్టులలో ప్రాథమిక నైపుణ్యాలు పెంపొందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు వివరాలను ఉపాధ్యాయుడు రవీందర్‌ను అడిగి తెలుసుకున్న కలెక్టర్,పాఠ్యపుస్తకాలు,నోట్‌బుక్స్ అందాయా అని విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులతో కూడిక,తీసివేత,గుణకారం వంటి గణిత ప్రాథమిక అంశాలపై ప్రశ్నలు అడిగి వారి చేత సమాధానాలు రాయించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని పరిశీలిస్తూ వారికి ప్రోత్సాహం అందించారు.





# పోచమ్మ తల్లి బోనాల మహోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్

వేములవాడ,జూలై 02(వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ, చందుర్తి మండలం అనంతపల్లి గ్రామం లో శ్రీ పోచమ్మ తల్లి బోనాల మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవం లో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విప్ గ్రామ ప్రజలతో కలిసి మహోత్సవ కార్యక్రమా ల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖ శాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.



# జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

## డీఎంహెచ్ఓ డాక్టర్ జి. ఎంజేలా అల్ఫ్రెడ్

వేములవాడ, జూలై 02,(వాయిస్ టుడే): జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో రాజన్న సిరిసిల్ల జిల్లా ను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి.ఎంజేలా అల్ఫ్రెడ్ సూచించారు.వేములవాడలోని బస్తీ దవాఖాన, పాలియేటివ్ కేర్ కేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. గర్భిణీల ను మొదటి త్రైమాసికంలోనే నమోదు చేయడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రు ల్లోనే వైద్య సేవలు పొందేలా ప్రోత్సహిం చాలని సూచించారు. రక్తహీనత తో బాధపడుతున్న గర్భిణీలను గుర్తించి ఐరన్ మాత్రలు అందించాలని, జిల్లాలో సిజేరియన్ ప్రసవాల శాతం అధికంగా ఉండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణ ప్రసవాల ప్రయోజనాలపై గర్భిణీలు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని, గర్భధారణ సమయంలో యోగా సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అసంక్రమిత వ్యాధుల నియంత్రణలో భాగంగా 30 సంవత్సరాలు పైబడిన వారందరికీ రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులపై స్క్రీనింగ్ నిర్వహించి అవసరమైన చికిత్స అందించాలని తెలిపారు. మానసిక ఆరోగ్య కార్యక్రమం లో భాగంగా మానసిక సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని మానసిక వైద్య నిపుణుల వద్దకు రిఫర్ చేయాలని ఆదేశించారు. సార్వత్రిక టీకాల కార్యక్రమం లో భాగంగా ప్రతి శిశువుకు సంపూర్ణ టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, కీటక జనిత వ్యాధుల నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. క్షయవ్యాధి అనుమాని తులకు తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించి పాజిటివ్‌గా నిర్ధారణ అయితే పూర్తి స్థాయి చికిత్స అందించాలని పేర్కొన్నారు. అనంతరం ల్యాబ్ టెక్నీషియన్లు, సబ్ యూనిట్ అధికారులతో సమావేశమై డెంగ్యూ తదితర కీటక జనిత వ్యాధుల నియంత్రణ చర్యలపై సమీక్షించారు. పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాల్లో వెంటనే ఫాగింగ్, క్రిమిసంహారక మందుల పిచికారీ చేపట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ అనిత, డాక్టర్ వేణుగోపాల్, డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, డీపీఓ రాజేందర్, కార్తీక్, మహేష్, రామనాథన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ముసుగులు తొలగింపుపై కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం

## రసమయి చర్య సిగ్గు చేటు



తిమ్మాపూర్, జూలై 02(వాయిస్ టుడే):మండలంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రాంగణంలో ప్రతిష్టించిన మహనీయుల విగ్రహాలకు వేసిన ముసుగులను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తొలగించినందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీశ్రేణులుఆందోళన చేపట్టారు. మహనీయుల విగ్రహాల ముసుగులు తొలగింపునకు బాధ్యుడైన రసమయితోపాటు అతని అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరిమి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎల్ఎండీ సీఐ రమేశ్ కు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరిమి అరుణ్ కుమార్ మాట్లాడుతూ దళితులను మోసం చేసిన రసమయి బాలకిషన్ దొంగచాటుగా మహనీయుల విగ్రహాల ముసుగులు తొలగించడం సిగ్గుచేటని విమర్శించారు.ప్రజల ఛీత్కారానికి గురైన రాజకీయ నిరుద్యోగిగా మిగిలిన బాలకిషన్ ఇప్పుడు విగ్రహాల పేరిట రాజకీయం చేయాలని చూస్తున్నరని ఆయన ఎద్దేవా చేశారు. మహనీయుల విగ్రహాలకు ఈ పరిస్థితి రావడానికి రసమయి కారణమని, గత బీఆర్ఎస్ హయాంలో ఆర్టీసీ అనుమతి పొందకుండానే విగ్రహాలు పెట్టినప్పుడు అనుమతి పొందాలనే సోయి ఎందుకు లేకుండా పోయిందని ఆయన ఘాటుగ విమర్శించారు.అనుమతి పొందకపోవడం రసమయి వైఫల్యం కాదా అని సూటిగా ప్రశ్నించారు.మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోటి రూపాయల సుడా నిధులో మహనీయుల విగ్రహ స్థలంలో సుందరీకరణ పనులు చేపట్టి త్వరలో కనీవినీ ఎరుగని రీతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్,బాబూ జగ్జీవన్ రాం విగ్రహాలను ఆవిష్కరించే సన్నాహాల్లో ఉండగా, దొంగచాటుగా వచ్చి రసమయి ముసుగులు తొలగించారని అరుణ్ కుమార్ ధ్వజమెత్తారు.ఇది రాజకీయ అక్కసుతోనే రసమయి ఈ చర్యకు పాల్పడినట్టు ఆయన చెప్పారు.ఈ మహనీయుల ప్రతిష్టను, గౌరవవాన్ని పెంచే రీతిలో విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సముద్రాల లక్ష్మణ్,దళిత నాయకులు అలువాల కోటి, మాతంగి అనిల్,రెడ్డిగాని రాజు,మామిడి అనిల్ కుమార్,మేడి అంజయ్య,కృష్ణబాబు,ఉప్పులేటి రాజు, కనుకం అశోక్,కనుకం కుమార్, చెన్నబోయిన రవి,పెరుక రవీందర్,అసోద శ్రీనివాస్,వంశీ,నగునూరి శ్రీనివాస్, తిమ్మాపూర్,మానకొండూర్,గన్నేరువరం మండలాల పార్టీ అధ్యక్షులు బండారి రమేశ్,ద్యావ శ్రీనివాస్ రెడ్డి,బొడ్డు సునిల్, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి,పెంచాల కిషన్ రావు,ముస్కు ఉపేందర్ రెడ్డి,కొమ్మెర రవీందర్ రెడ్డి,రాజేశ్వరి,బందెల మహేందర్, పెరుక రవీందర్,రాములు యాదవ్,మీస సత్యనారాయణ,రామకృష్ణ,బొట్ల కిషన్, గొల్లెన కొమురయ్య,తమిశెట్టి రాజేశ్,రమేశ్, చంద్రాకర్, బాపురావు, అజయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



# తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల పాలాభిషేకం

## ప్రభుత్వానికి కృతజ్ఞతలు

సిరిసిల్ల, జూలై 02(వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లాలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు రాష్ట్ర ప్రభుత్వానికి పాలాభిషేకం నిర్వహించి తమ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వం ప్రతి నెల ఒకటో తేదీన కళాకారుల జీతాలను సకాలంలో వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కళాకారులు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. కళాకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జీతాలను ఎలాంటి ఆలస్యం లేకుండా ప్రతి నెల ఒకటో తేదీన విడుదల చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల కళాకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతోందని, ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారధి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వంతడుపుల గణేష్, టీం లీడర్ పొత్తూరి రాజు, సీనియర్ కళాకారులు ఎడమల శ్రీధర్ రెడ్డి, అకునూరి దేవయ్య, శ్రీరాముల రామచంద్రం, గడ్డం దేవయ్య, గడ్డం శ్రీనివాస్, గుగ్గిళ్ల పరశురాములు, పూదూరి సంజీవ్, అనుముల శిరీషతో పాటు పలువురు కళాకారులు పాల్గొని ప్రభుత్వానికి కృతజ్ఞతాభి వందనాలు తెలిపారు.



# చివరి లబ్ధిదారుని వరకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం

## సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్, జూలై 02(వాయిస్ టుడే): ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు ఉండాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష అని కరీంనగర్ నియోజకవర్గంలో ప్రభుత్వం రెండవసారి ఇచ్చిన మంజూరు కలుపుకొని ఇంకా 3 వేల మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు ఇచ్చే అవకాశం ఉందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.25 వ డివిజన్ రోడ్ నెంబర్ 9 లోని లబ్ధిదారుడు గంగాధర కనుకయ్య భాగ్యలక్ష్మిల గృహ ప్రవేశానికి స్థానిక కార్పోరేటర్ గంట శ్రీనివాస్ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పది సంవత్సరాలు డబుల్ బెడ్రూం ఇండ్లిస్తామని మోసం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.అర్హులైన చివరి లబ్ధిదారుని వరకు ఇల్లు ఇవ్వాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క లక్ష్యం అని నరేందర్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గంట కల్యాణి,దండి రవీందర్, జె.లక్ష్మణ్,రాజారాం,భాస్కర్ పాల్గొన్నారు.



# ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

భద్రాద్రి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ వైద్య సిబ్బందికి సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని డాక్టర్లు, ఇతర సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి సకాలంలో వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# ఆర్టీసీ బస్సుకు ప్రమాదం.. యాక్సిల్ విరగడంతో ఊడిపోయిన టైరు

వైరా: భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఖమ్మం వైపునకు వెళ్తోన్న బస్సు ముందు భాగంలో యాక్సిల్ విరిగిపోవడంతో టైరు ఊడిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ఘటన వైరా మండలం పినపాక బ్రిడ్జిపై జరిగింది. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో సత్తుపల్లి, భద్రాచలం, ఖమ్మం వెళ్లే వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

# గడప గడపకు నాయిని... కంచరకుంటలో ఎమ్మెల్యే పర్యటన

## అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా ప్రత్యేక చొరవ

## ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలపై ఆరా..

## రెవెన్యూ,గృహ నిర్మాణ,మున్సిపల్ అధికారులతో కలిసి విస్తృత పర్యటన



హనుమకొండ (వాయిస్ టుడే) : గడప గడపకు నాయిని కార్యక్రమంలో భాగంగా గురువారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 7వ డివిజన్ పరిధిలోని కంచరకుంట ప్రాంతంలో వరంగల్ పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో మమేకమవుతూ ప్రతి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి వారి ఆర్థిక పరిస్థితులు,నివాస స్థితిగతులు,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు,మౌలిక సదుపాయాలు,ప్రభుత్వ సేవల అందుబాటు వంటి అంశాలపై స్వయంగా వివరాలు సేకరించారు. పర్యటన సందర్భంగా అనేక కుటుంబాలకు ఇంటి స్థలం ఉన్నప్పటికీ సొంత ఇల్లు లేక శిథిలావస్థలో నివసిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి వచ్చింది. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియక చాలామంది వెనుకబడిపోయినట్లు గుర్తించారు. అలాగే అర్హులైన అనేక కుటుంబాలు ఇప్పటికీ రేషన్ కార్డులు,ఆసరా,వృద్ధాప్య,వితంతు తదితర సామాజిక భద్రతా పథకాల కోసం దరఖాస్తు చేసుకోకపోవడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

### అధికారులకు కీలక ఆదేశాలు..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ,గృహ నిర్మాణ,మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో కంచరకుంట ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి ఇంటికి అధికారులు స్వయంగా వెళ్లి కుటుంబాల వివరాలు నమోదు చేయాలని,అర్హులైన ప్రతి కుటుంబానికి అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అర్హత కలిగిన ఒక్క కుటుంబం కూడా ప్రభుత్వ సంక్షేమ ఫలాలకు దూరం కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేసిన ఎమ్మెల్యే,కంచరకుంట ప్రాంత సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

### ఎమ్మెల్యే చొరవపై స్థానికుల హర్షం..

ప్రజలతో నేరుగా మమేకమై ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను ఓపికగా వినడం,సమస్యల పరిష్కారానికి భరోసా ఇవ్వడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నో సంవత్సరాలుగా తమ ప్రాంతానికి తగిన ప్రాధాన్యం దక్కలేదని,తొలిసారిగా ఒక ప్రజాప్రతినిధి ఇంటింటికీ వచ్చి కుటుంబ సభ్యుల పరిస్థితులను స్వయంగా తెలుసుకుంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం తమకు ఎంతో ధైర్యాన్నిచ్చిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు, మకార్యకర్తలు,వార్డు బాధ్యులు పాల్గొన్నారు.